Follow: @ANNTELUGU

14-10-2026

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 252 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM







టాప్ న్యూస్

## కేంద్ర మంత్రి పదవికి ఎల్. మురుగన్ రాజీనామా



- మోదీ తమిళనాడు పర్యటన తర్వాత వరుసమార్పులు
- నిన్న గవర్నర్ .. నేడు కేంద్రమంత్రి ఔట్
- తమిళనాడు నేతలపై ఆగ్రహంగా మోదీ

02

## రీల్స్ చేయడం వల్ల జీవితం బాగుపడదు : హీరో సూర్య



- విద్యార్థులు చదువులపై దృష్టి సారించాలని సూచన

02

## దేశమంతా మోదీ వైపే మీకు నాలుగో ఓటమి తప్పదు



- అమిత్ షా విసుర్లు

02

## ఉత్సాహంగా.. విజయవాడ ఉత్సవ్

04



## ఇంద్రకీలాద్రిపై తమిళనాడు సీఎం విజయ్

# ప్రత్యేక పూజలు.. అభిమానుల కోలాహలం

### విజయవాడ ఉత్సవ్ లో ప్రత్యేక ఆకర్షణగా విజయ్

### చెన్నైకు తాగునీటి కోసం అదనపు జలాలు ఇవ్వాలని చంద్రబాబుకు వినతి

**విజయవాడ, మహా :** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు విచ్చేశారు. చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఏపీ ప్రభుత్వ ప్రతినిధులు, ఆలయ అధికారులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ ఏపీకి రావడం ఇదే తొలిసారి కావడంతో విజయవాడ నగరంతో పాటు గన్నవరం విమానాశ్రయ ప్రాంగణం అభిమానుల కోలాహలంతో నిండిపోయింది. సీఎం విజయ్‌ను చూసేందుకు ఆయన అభిమానులు భారీగా తరలివచ్చారు. విమానాశ్రయం వెలుపలకు వచ్చిన విజయ్ అభిమానులకు అభివాదం చేస్తూ కాన్వాయ్‌లో ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణిస్తున్న వాహనం వెంట అభిమానులు ఉత్సాహంతో పరుగులు తీశారు. విమానాశ్రయం నుంచి నేరుగా ఇంద్రకీలాద్రికి చేరుకున్న సీఎం విజయ్‌కి ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. విజయవాడ కనకదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న వేళ.. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణా దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. తమిళనాడు సీఎం విజయ్ అన్నపూర్ణా దేవి రూపంలో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు

మిగతా 2వ పేజీలో



## పొత్తు స్థానాలపై ఉత్కంఠ

- మేయర్ స్థానాల పోటీపై అర్ధరాత్రి దాకా చర్చలు
- ఆరు కార్పొరేషన్లు, 26 మున్సిపాలిటీలపై జనసేన పట్టు
- పవన్ కల్యాణ్ తో టీడీపీ కమిటీ చర్చలు

02

## స్థానిక ఎన్నికల జోరు..

- నేడు షెడ్యూల్ విడుదల చేయనున్న ఎస్ ఈసీ
- 28 జిల్లా పరిషత్ లకు రిజర్వేషన్లు ఖరారు
- నెల్లూరు, అన్నమయ్య, కడప, మార్కాపురం జనరల్

02




## విద్యతోనే సామాజిక ఆర్థిక అసమానతల నిర్మూలన

- విద్యతోనే సామాజిక ఆర్థిక అసమానతల నిర్మూలన
- ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ విద్యార్థులను తీర్చిదిద్దుతాం
- ఉపాధ్యాయుల భాగస్వామ్యంతోనే తెలంగాణ భవిష్యత్తు నిర్మాణం
- 'గురు వందనం–ఎడ్యుకేషన్ కాంక్లేవ్ అండ్ టీచర్స్ అవార్డ్స్ –2026' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

02

## రెండు ఎమ్మెల్సీ స్థానాలు

# గెలవాల్సిందే

### నేతలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్యాచరణ
- ప్రతిపక్షపార్టీల విమర్శలను తిప్పికొట్టాలని ఆదేశం
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సహా
- హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు

**ఢిల్లీ, మహా :** గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దని, రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న కరవు, విద్యుత్ కొరత, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. ఢిల్లీలోని రేవంత్ రెడ్డి నివాసంలో నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఢిల్లీలో అందుబాటులో ఉన్న నేతలతో సీఎం, పీసీసీ అధ్యక్షుడు సమావేశమయ్యారు. గంటకుపైగా కొనసాగిన సమావేశంలో వివిధ అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో మంత్రులు, ఎమెల్యేలు సైతం పాల్గొన్నారు. గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దని, రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు దిశానిర్దేశం చేశారు. ఎవరి

మిగతా 2వ పేజీలో



## ముగిసిన సీఎం ఢిల్లీ పర్యటన

### హైదరాబాద్ కు తెలంగాణ కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, మహా :** ఢిల్లీ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. రాత్రి 8 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి, రోహిన్ రెడ్డిలు ఢిల్లీ నుంచి బయలుదేరారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఆదివారం ఢిల్లీ వెళ్లిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు తిరుగు ప్రయాణమయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను, రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కలిశారు.

## దేశ ప్రజలంతా మాతో ఉన్నారు



- జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు నిరసనలు
- రాహుల్ గాంధీ

02

## స్థానిక ఎన్నికల అభ్యర్థులపై



- వైఎస్ జగన్ సుదీర్ఘ కసరత్తు
- సగం స్థానాలకు అభ్యర్థుల ఖరారు

02









## రీల్స్ చేయడం వల్ల జీవితం బాగుపడదు

- హీరో సూర్య
- విద్యార్థులు చదువులపై దృష్టి సారించాలని సూచన

**చెన్నై, మహా** : రీల్స్ చేయడం వల్ల జీవితం బాగుపడదని, ఉన్నతస్థాయికి చేరుకోలేరని హీరో సూర్య హితవు పలికారు. నటుడు శివకుమార్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ 47వ వార్షికోత్సవ వేడుకలు టి.నగర్‌లోని ఆగరం ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగాయి. ఈ వేడుకల్లో ప్లస్ టూ పూర్తి చేసి కళాశాలలో చేరిన 25 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. అలాగే, ప్రముఖ చిత్రకారుడు జీవానందన్ కు కూడా రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. 25 మంది విద్యార్థులతో పాటు అణగారిన వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు విద్యాదానం చేస్తున్న కొన్ని విద్యా సంస్థలతో కలిసి రూ.13.78 లక్షల మేరకు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా హీరో సూర్య మాట్లాడుతూ.. 'విద్యార్థులు చదువులపై దృష్టి సారించాలి. రీల్స్ చేయడం వల్ల జీవితం బాగుపడదు. సినిమాల్లో సరిగా నటించకపోతే దర్శకుడు రీటేక్ చెబుతారు కానీ, నిజ జీవితంలో రీటేక్లుండవు. కష్టపడి చదువుకుంటేనే ఉన్నతస్థాయికి చేరుకోగలరు. చదువుల్లో వెనుకబడినపుడల్లా వన్స్ మోర్, వన్స్ మోర్ అంటూ తమను తాము ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగాలి' అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సీనియర్ నటుడు శివకుమార్ మాట్లాడుతూ.. 1979 లో నా వందో చిత్రం 'రోసాప్పూ రవి కైక్కారి'కి గాను ఇచ్చిన రూ.25 వేల పారితోషికాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి తద్వారా వచ్చిన వడ్డీని పేద విద్యార్థులకు సహాయం చేసేందుకు ఉపయోగిస్తున్నాం. ఆరంభంలో విద్యార్థులకు వివిధ రకాల బహుమతులు ఇచ్చేవాళ్ళం. ఆ తర్వాత నా సొంత నిధుల నుంచి ఉపకారవేతనాలు అందించాను. 2006 నుంచి అగరం ఫౌండేషన్ నా పౌండేషన్ బాధ్యతలను స్వీకరించి, ప్రతి యేటా ఉపకారవేతనాలను, అవార్డులను అందిస్తోందన్నారు.





## ఇంద్రకీలాద్రిపై తమిళనాడు సీఎం విజయ్

. దర్శనానంతరం ఆలయ మంటపంలో వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. అనంతరం దుర్గగుడి అధికారులు అమ్మవారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు, కనకదుర్గమ్మ చిత్రపటాన్ని సీఎం విజయ్‌కి అందజేశారు. దుర్గమ్మ దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం సీఎం విజయ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలవడానికి బయలుదేరి వెళ్లారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ రాజకీయం, ప్రాంతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించేందుకు వేదిక కానుంది. మంగళవారం రాత్రి విజయవాడ నగరంలో వైభవంగా నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం విజయ్ పాల్గొన్నారు. తమిళనాడు సీఎం తొలిసారిగా ఏపీకి వచ్చి ఇటు దైవదర్శనం, అటు రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం బెజవాడ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రశాంతంగా దర్శనం పూర్తయ్యేలా, అభిమానుల రద్దీని నియంత్రించేలా విజయవాడ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.



చంద్రబాబుకు విజయ్ వినతులు

తమ రాష్ట్ర రాజధాని చెన్నై నగరం ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తెలుగు గంగ ద్వారా అదనపు జలాలను విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన, మంగళవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల అంశంపైనే చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి విజయ్‌కు, ఆయన వెంట వచ్చిన అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో చెన్నై నగర తాగునీటి అవసరాలను తీర్చడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింతగా సహకరించాలని సీఎం విజయ్ అభ్యర్థించారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా నదిలో జలాల లభ్యత గణనీయంగా తగ్గి, ఏపీలోనే తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయినప్పటికీ, పొరుగు రాష్ట్ర దాహార్తిని తీర్చాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఒప్పందం ప్రకారం చెన్నై నగరానికి 4.08 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు చంద్రబాబు వివరించారు. భవిష్యత్తులో ప్రాజెక్టులలో నీటి లభ్యత, అవసరాలను బేరీజు వేసుకుని, మరికొంత నీటిని విడుదల చేసే అంశాన్ని కచ్చితంగా పరిశీలిస్తామని ఆయన విజయ్‌కు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కరవు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే గోదావరికావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు ఆవశ్యకతను చంద్రబాబు నొక్కి చెప్పారు. ఈ బృహత్తర పథకం రెండు రాష్ట్రాలకే కాకుండా దేశానికే మేలు చేస్తుందని ఆయన వివరించారు.



## దేశమంతా మోదీ వైపే

**మీకు నాలుగో ఓటమి తప్పదు**
**అమిత్ షా విసుర్లు**

**ఢిల్లీ, మహా** : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రతిపక్షాల తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ సాధిస్తున్న అపారమైన ప్రజాదరణను జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఎస్ ఐఆర్ సాకుతో దేశంలోకి చొరబాటుదారులను ఓటర్లుగా మార్చాలనే కాంగ్రెస్ కుట్రలను దేశ ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారని స్పష్టం చేశారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కూటమికి ఘోర పరాజయం తప్పదని అమిత్ షా జోస్యం చెప్పారు. బీజేపీ, మోదీల విజయాన్ని ఏదో ఒక కారణం చెప్పి కొట్టిపారేసే బదులు, కాంగ్రెస్ పార్టీ తమ వైఫల్యాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఒకప్పుడు సుదీర్ఘకాలం ఏలిన రాష్ట్రంలోనే గత 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నిక కూడా గెలవలేకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. కల్పిత మీడియా ఈవెంట్లు, నిరంతర అబద్ధాల ద్వారా ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడం సాధ్యం కాదని హితవు పలికారు. వచ్చే 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఎన్‌డీఏ కూటమి భారీ మెజారిటీతో విజయం సాధించబోతోందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఆయన మిత్రపక్షాలు వరుసగా నాలుగో ఓటమికి సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు.




## విద్యతోనే సామాజిక ఆర్థిక అసమానతల నిర్మూలన

**హైదరాబాద్, మహా** : విద్య ద్వారానే సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలమని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. విద్య ఎంతగా అభివృద్ధి చెందితే సమాజం అంతగా పురోగమిస్తుందని, అందుకే తమ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ భారీగా నిధులు కేటాయించడంతోపాటు విప్లవాత్మక సంస్కరణలు చేపడుతోందని అన్నారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జీ తెలుగు న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గురు వందనం-ఎడ్యుకేషన్ కాంక్లేవ్ అండ్ టీచర్స్ అవార్డ్స్-2026' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. విద్య అనేది కేవలం ఉద్యోగం సంపాదించడానికి మాత్రమే కాదని, సమాజంలో వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలు అభివృద్ధి చెందడానికి అత్యంత శక్తివంతమైన సాధనమన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా పరిస్థితుల సర్వేలోనూ విద్య ప్రాధాన్యం స్పష్టమైందన్నారు. తెలంగాణ విద్యార్థులను ప్రపంచంతో పోటీపడే స్థాయిలో తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తూ విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు డీఎస్సీ ద్వారా పెద్దఎత్తున ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేశామని, ఒక్కో పాఠశాలలో 2,000 నుంచి 2,500 మంది విద్యార్థులు చదువుకునేలా ఆధునిక వసతులతో నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలన్న తమ లక్ష్య సాధనలో విద్యారంగం, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు, ఎంపీ ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

( మొదటి పేజీ తరువాయి )

పరిధిలో వాళ్లు గట్టిగా పని చేయాలని, పట్టభద్రుల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని సీఎం స్పష్టం చేశారు. ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ వరకు ప్రతి విషయంలోనూ ప్రత్యేక దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డి నాయకులకు సూచించారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, హైదరాబాద్ రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సామా రామ్మోహన్ రెడ్డిలు పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించడంతోపాటు ఆయా నాయకులతో సమావేశమవుతూ తమ గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు.

కార్యాచరణతో ముందుకెళ్లాలి

మంత్రులు, ఎమ్మెల్యేలతో గంటకు పైగా జరిగిన సమీక్ష సమావేశంలో పట్టభద్రుల ఎన్నికలతోపాటు రాష్ట్రంలోని కరవు పరిస్థితులు, విద్యుత్తు కొరత లాంటి అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ఈ అంశాలపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను ఎక్కడిక్కడ తిప్పి కొట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఎన్నికలు జరుగుతున్న ఆరు ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు సమన్వయంతో పని చేయాలని, రెండు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా ఇప్పటి నుంచే కార్యాచరణతో ముందుకెళ్లాలని సీఎం సూచించారు. పలు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు నేతలకు దిశానిర్దేశం చేశారు.



## దేశ ప్రజలంతా మాతో ఉన్నారు

**జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు నిరసనలు : రాహుల్ గాంధీ**

**ఢిల్లీ, మహా** : దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం విపక్షాలు, విద్యార్థి, పౌర సంఘాలు ఏకతాటిపై నిలబడి ఐక్యపోరాటం చేస్తున్నట్లు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. ఆయన తన నివాసంలో 'ఇండీ' కూటమి నేతలకు, పౌర, విద్యార్థి సంఘాల ప్రతినిధులకు తేనీటి విందు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాహుల్‌గాంధీ, ఓటు చోరీకి బాధ్యులైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను కోర్టు ముందు నిలబెట్టడమే ప్రతిపక్షాల లక్ష్యమన్నారు. సుప్రీం కోర్టుతో పాటు ప్రధాన న్యాయమూర్తిపై తమకు అత్యంత గౌరవం ఉందన్నారు. ఈ విషయంలో న్యాయవ్యవస్థ తన పాత్రను నిర్వర్తిస్తుందని ఆశిస్తున్నట్లు రాహుల్‌గాంధీ తెలిపారు.మోదీ సారథ్యంలోని ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను నాశనం చేసిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. జంతర్ మంతర్‌ను డినోటిఫై చేయటాన్ని ఆయన ఖండించారు. దేశ ప్రజలంతా తమతో ఉన్నారని రాహుల్ గాంధీ చెప్పారు. దేశ భవిష్యత్తు కోసమే తాము పోరాటం చేస్తున్నామన్నారు. సోమవారం జరిగిన నిరసనలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని చెప్పారు. సోమవారం ఢిల్లీ వీధుల్లో తాము చేపట్టిన నిరసనలకు హాజరై, మద్దతు తెలిపిన ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఓటు చోరీ వెనుక ఎవరున్నా శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టంచేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు రాజకీయ, ప్రజా నిరసనలు కొనసాగుతాయని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు.



## పొత్తు స్థానాలపై ఉత్కంఠ

- మేయర్ స్థానాల పోటీపై అర్ధరాత్రి దాకా చర్చలు
- ఆరు కార్పొరేషన్లు, 26 మున్సిపాలిటీలపై జనసేన పట్టు
- పవన్ కల్యాణ్ తో టీడీపీ కమిటీ చర్చలు

**అమరావతి, మహా** : కూటమిలో సీట్ల లెక్కలపై కన్ఫ్యూజన్ నెలకొంది. మొత్తం 17 మేయర్ స్థానాల్లో ఆరు స్థానాలు జనసేన ఆశిస్తుండగా, 3 సీట్లకు మించి ఇవ్వడానికి టీడీపీ సుముఖంగా లేదు. ఎక్కడా నెంబర్ మ్యాచ్ అవడం లేదు. మేయర్ సీట్లలో 11 4 2 కుదరవచ్చని లేకపోతే ఫ్రెండ్లీ కంటెస్ట్ తప్పదన్న అభిప్రాయం ఉంది. మరోవైపు రిజర్వేషన్లపై కూడా పవన్ సంతృప్తిగా లేరని చెబుతున్నారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ, సీట్ల సర్దుబాటుపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా 6 కార్పొరేషన్లు (మేయర్ స్థానాలు), 26 మున్సిపాలిటీలను కేటాయించాలని కోరినట్లు సమాచారం. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్.. సీట్ల సర్దుబాటు వివరాలపై తమ పార్టీ ముఖ్య నేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేనిలతో మాట్లాడాలని సూచించారు. నాదెండ్లతో జరిపే చర్చల అనంతరం సీట్ల కేటాయింపుపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలోని మొత్తం 17 నగర పాలక సంస్థల (కార్పొరేషన్లు) మేయర్ పదవుల్లో ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో, ఎక్కడెక్కడ పోటీ చేయాలనే దానిపై కూటమి నేతలు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే జనసేనకు విజయవాడ, మచిలీపట్నం, కాకినాడ కార్పొరేషన్ స్థానాలను కేటాయించే అంశంపై చర్చలు దాదాపు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే జనసేన కోరుతున్న మరో మూడు కార్పొరేషన్ స్థానాలపై మాత్రం ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల స్థానాలపైనా విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని స్థానిక రాజకీయ సమీకరణాలు, గెలుపోటముల అవకాశాలు, పార్టీల బలాబలాలను ప్రాతిపదికగా తీసుకుని స్థానాల సర్దుబాటును త్వరలోనే పూర్తి చేయాలని కూటమి నాయకత్వం భావిస్తోంది.

## కేంద్ర మంత్రి పదవికి ఎల్. మురుగన్ రాజీనామా

- మోదీ తమిళనాడు పర్యటన తర్వాత వరుసమార్పులు
- నిన్న గవర్నర్ .. నేడు కేంద్రమంత్రి ఔట్
- తమిళనాడు నేతలపై ఆగ్రహంగా మోదీ




**న్యూఢిల్లీ, మహా** : కేంద్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖతో పాటు పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎల్. మురుగన్ తన మంత్రి పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసిన ఆయన.. కేంద్ర ప్రభుత్వ బాధ్యతల నుంచి తనను తప్పించాలని, రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకునేందుకు అనుమతించాలని కోరారు. తమిళనాడులో భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు 2029 లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సిద్ధం చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామాలు, వీధుల్లో పర్యటిస్తూ పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలని, ప్రజలతో నేరుగా మమేకమై పార్టీ విస్తరణకు కృషి చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న తరుణంలో మురుగన్ రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తమిళనాడుకు చెందిన ఎల్. మురుగన్ మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2021లో తొలిసారి పెద్దల సభకు ఎన్నికైన ఆయన.. 2024 ఏప్రిల్‌లో రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. రెండోసారి ఎన్నిక కావడంతో ఆయన పదవీకాలం 2030 వరకు కొనసాగాల్సి ఉంది. అయితే పదవీకాలం ముగియడానికి ముందే సభ్యత్వాన్ని వదులుకోవాలని నిర్ణయించుకున్నారు. కేంద్ర మంత్రి పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి ఒకేసారి రాజీనామా చేయడం ద్వారా రాష్ట్ర రాజకీయాలపై తన దృష్టిని కేంద్రీకరించనున్నట్లు స్పష్టం చేశారు.

**విజయ్ పాపులారిటీకి షాక్**

తమిళనాడులో సీఎం విజయ్ పాపులారిటీకి మోదీ షాకయ్యారు. ప్రధాని తమిళనాడు పర్యటన బీజేపీకి పెద్దగా ఉపయోగపడకపోగా, తన పాపులారిటీ తగ్గడం, విజయ్ కు తనకన్నా అధిక స్పందన ఉండడంపై మోదీ ఆగ్రహించారు. తమిళనాడు దాటి వెళ్ళిన వెంటనే గవర్నర్ ను మార్చేయగా, కేంద్రమంత్రిని కూడా రాజీనామాకు ఆదేశించారు. రాజ్యసభ సభ్యత్వం కూడా పీకేసి ఉన్నపళంగా తమిళనాడు పంపించారంటే మోదీ ఎంత ఆగ్రహంగా ఉన్నాడో స్పష్టమవుతోంది. జయలలిత మరణం నాటినుండీ తమిళరాజకీయాలను గుప్పిట పట్టుకున్న మోదీ.. ఇపుడు పూర్తిగా ఊహించని పరిణామాలు జరగడం, విజయ్ ఇతరుల్లాగా అతి చనువు ప్రదర్శించకపోవడంతో తమిళనాట ఆసక్తికర రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి.

## స్థానిక ఎన్నికల అభ్యర్థులపై వైఎస్ జగన్ సుదీర్ఘ కసరత్తు

తాడేపల్లి, మహా : రీజనల్ కోఆర్డినేటర్లతో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 7.30 వరకు సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థులపై సుదీర్ఘ కసరత్తు చేశారు. రీజనల్ కోఆర్డినేటర్లు, పార్లమెంటు పరిశీలకులతో వన్ టు వన్ చర్చలు జరిపారు వైఎస్ జగన్. సగం కార్పొరేషన్లలో అభ్యర్థుల ఖరారు దాదాపు పూర్తయింది. బుధవారం కూడా ముఖ్య నేతలతో వైఎస్ జగన్ సమావేశం కానున్నారు. మునిసిపల్‌తో పాటు జడ్పీ అభ్యర్థులను ఖరారుచేయనున్నారు.

## స్థానిక ఎన్నికల జోరు..

- **నేడు షెడ్యూల్ విడుదల చేయనున్న ఎస్ ఈసీ**
- **28 జిల్లా పరిషత్ లకు రిజర్వేషన్లు ఖరారు**
- **నెల్లూరు, అన్నమయ్య, కడప, మార్కాపురం జనరల్**

**అమరావతి, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం 11:30 గంటలకు ఎన్నికల కమిషన్ అధికారికంగా ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. ఈ షెడ్యూల్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 100 పురపాలక (మున్సిపాలిటీలు), నగరపాలక (కార్పొరేషన్లు) సంస్థలు, నగర పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. మిగిలిన 23 స్థానాలకు మరొక రోజు వేరుగా నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లుగా అధికారులు వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడనుండటంతో ఏపీ రాజకీయాల్లో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది. ఏపీలోని మొత్తం 28 జడ్పీ ఛైర్మన్ల పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ బీసీ, తిరుపతి ఎస్సీ మహిళ, ఎన్టీఆర్‌ఎస్సీ, కృష్ణా ఉమెన్, ప్రకాశం ఎస్సీ, నెల్లూరు జనరల్, గుంటూరు ఎస్సీ మహిళ, పల్నాడు మహిళ, తూ.గో జనరల్ మహిళ, కోనసీమ ఎస్సీ మహిళ, పోలవరం ఎస్టీ మహిళ, అల్లూరు ఎస్టీ. ఆరు జడ్పీలు జనరల్ కాగా, నెల్లూరు, అన్నమయ్య, కడప, మార్కాపురం, వెస్ట్ ఈ జాబితాలో ఉన్నాయి.

# ఇక 6జీ యుగం

- **6జీని ప్రవేశపెట్టే తొలి దేశాల సరసన భారత్**
- **5జీతో పోలిస్తే ఐదు రెట్లు అధిక సామర్థ్యం..**
- **పది రెట్లు తక్కువ లేటెన్సీ లక్ష్యం**
- **ఐఎంసీ 2026లో ప్రీ-6జీ టెక్నాలజీ ప్రదర్శన**
- **8 వేలకుపైగా పేటెంట్లు దాఖలు చేసినట్లు వెల్లడి**




**న్యూఢిల్లీ, మహా :** భారత టెలికాం దిగ్గజం జియో 6జీ సాంకేతికత దిశగా అడుగులు వేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 6జీ ప్రమాణాలు 2030లో ఖరారైనప్పుడు, ఆ సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చే తొలి దేశాల్లో భారత్ కూడా ఉండవచ్చని సంస్థ అంచనా వేస్తోంది. ఇప్పటికే ప్రీ 6జీ టెక్నాలజీ స్టాక్, గిగా మిమో రేడియోను అభివృద్ధి చేసినట్లు జియో వెల్లడించింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2026లో వీటిని ప్రదర్శనకు ఉంచింది.

ప్రస్తుత 5జీ నెట్‌వర్క్‌లతో పోలిస్తే 6జీ నెట్‌వర్క్‌లు ఐదు రెట్లు అధిక సామర్థ్యాన్ని అందించగలవని జియో అంచనా వేస్తోంది. అదే సమయంలో డేటా ప్రసారంలో జాప్యాన్ని (లేటెన్సీ) దాదాపు పది రెట్లు తగ్గించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపింది. దీనివల్ల ఒకేసారి ఎక్కువ డేటాను, అధిక సంఖ్యలో వినియోగదారులను నెట్‌వర్క్ నిర్వహించగలుగుతుంది. అలాగే వినియోగదారుల ఆదేశాలకు మరింత వేగంగా స్పందించే అవకాశం ఉంటుంది. డేటా వేగాలు కూడా మెరుగుపడే అవకాశం ఉందని సంస్థ పేర్కొంది. ఈ పరిణామాలతో రియల్‌టైమ్ కృత్రిమ మేధ (ఏఐ), హోలోగ్రాఫిక్ వీడియోలు, వైద్య సేవలు, విద్య, తదితర భవిష్యత్ డిజిటల్ సేవల్లో కొత్త అవకాశాలు అందుబాటులోకి రావచ్చని వివరించింది.

**గిగా మిమో రేడియో ప్రత్యేకత**

ఐఎంసీ ప్రదర్శనలో జియో అభివృద్ధి చేసిన గిగా మిమో రేడియో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇది భారత్‌లోనే తొలిసారిగా అభివృద్ధి చేసిన సాంకేతికతగా సంస్థ పేర్కొంది. 5జీ, 6జీ రెండింటికీ మద్దతు ఇచ్చే ఉమ్మడి బేస్‌బ్యాండ్ యూనిట్‌ను కూడా జియో ఆవిష్కరించింది.6జీ పోటీ కేవలం అధిక నెట్‌వర్క్ సామర్థ్యం, వేగవంతమైన స్పందనకే పరిమితం కాదని సంస్థ అభిప్రాయపడింది. భవిష్యత్తులో కనెక్టివిటీని నిర్వచించే సాంకేతికత, ప్రపంచ ప్రమాణాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం కూడా కీలకమని పేర్కొంది. ఈ దిశగా ఇప్పటివరకు 8,000కుపైగా పేటెంట్లు దాఖలు చేసినట్లు జియో వెల్లడించింది. వీటిలో వందల సంఖ్యలో 6జీకి సంబంధించిన పేటెంట్లు ఉన్నాయని తెలిపింది. ప్రపంచ ప్రమాణాల రూపకల్పనకు సంబంధించి 934కుపైగా ప్రతిపాదనలు, సాంకేతిక సహకారాలు అందించినట్లు సంస్థ పేర్కొంది.

**రైతులు, వైద్యులు, విద్యార్థులకు ఏఐ సేవలు**

6జీ ద్వారా కృత్రిమ మేధ ఆధారిత సేవలు మరింత వేగంగా, సమర్థంగా స్పందించేలా చేయవచ్చని జియో భావిస్తోంది. ముఖ్యంగా తక్షణ సమాచారం, వేగవంతమైన సమాధానాలు అవసరమయ్యే సందర్భాల్లో ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని పేర్కొంది. ఐఎంసీ ప్రదర్శనలో రైతులు, వైద్యులు, విద్యార్థుల కోసం ఏఐ ఆధారిత సేవలు అందించే అవకాశాలను సంస్థ వివరించింది. ఏఐ ఆధారిత నెట్‌వర్క్‌లు, క్వాంటమ్ సాంకేతికతకు సైతం తట్టుకోగల భద్రతా వ్యవస్థల అభివృద్ధిపైనా జియో దృష్టి సారించింది. వేగవంతమైన కనెక్టివిటీతోపాటు మరింత పటిష్ఠమైన భద్రతను అందించే నెట్‌వర్క్‌లను రూపొందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది.



## ఓటమిని తట్టుకోలేక రాజ్యాంగ సంస్థలపై దండయాత్ర

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.

**న్యూఢిల్లీ, మహా :** దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ చేస్తోన్న నిరసన డ్రామాలను చూసి ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో గెలవడం చేతగాక రాజ్యాంగబద్ధ సంస్థలపై కాంగ్రెస్ ముప్పేట దాడికి తెగబడుతోందని ధ్వజమెత్తారు. గతంలో లోక్‌సభ స్పీకర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారని, ఆ తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) దిగిపోవాలని కోరారని, చివరికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సైతం రాజీనామా చేయాలంటూ దిగజారి మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. వేలాది మందిని సుప్రీంకోర్టు వద్దకు పంపి న్యాయమూర్తులపై ఒత్తిడి తెస్తూ, బెదిరింపులకు దిగడం అత్యంత శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల మద్దతు లేక వరుసగా ఓడిపోతుంటే దానికి ఎన్నికల సంఘం ఎలా బాధ్యత వహిస్తుందని ఆయన నిలదీశారు.

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకపోతే ప్రజలదే తప్పన్నట్లు ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. తమతో 200 మంది అధికారులు టచ్‌లో ఉన్నారంటూ రాహుల్ గాంధీ ఎవరిని బెదిరించాలని చూస్తున్నారని ప్రశ్నించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, బాబు జగ్జీవన్ రామ్, ఎన్టీఆర్ వంటి మహానాయకులను కాంగ్రెస్ గతంలో తీవ్రంగా అవమానించిన విషయాన్ని ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేదని గుర్తుచేశారు. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. రాహుల్ గాంధీతో పోటీపడుతూ మరింత దిగజారి ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ గజం ఎగిరితే, రేవంత్ రెడ్డి రెండు గజాలు ఎగురుతున్నారని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ ఎలాంటి ప్రజాస్వామ్య నిరసనలు, ధర్నాలు చేపట్టాలన్నా నాయకులను గృహనిర్బంధాలు (హౌస్ అరెస్టులు) చేస్తున్నారని, చివరకు హైకోర్టును ఆశ్రయించి అనుమతి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో తాము ధర్నాలు చేయడానికి అనుమతి ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం, ఢిల్లీలో తమ నిరసనలకు అనుమతి లభించడం లేదంటూ ద్వంద్వ నీతులు మాట్లాడుతోందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి వారానికి ఒకసారి ఢిల్లీకి రావడం, ప్రధాని నరేంద్ర మోదీపై నిరాధార ఆరోపణలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఢిల్లీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయని, జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనలతో విసిగిపోయిన స్థానిక ప్రజలు, వ్యాపారులు ఆ నిరసన వేదికను మరోచోటుకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

## టీ20 టికెట్ల బ్లాక్ మార్కెటింగ్ గుట్టురట్టు

- **'నాట్ ఫర్ సేల్' టికెట్లతో దందా.. నలుగురు అరెస్ట్**
- **వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా టికెట్ల విక్రయం.**

**హైదరాబాద్, మహా :** భారత్-వెస్టిండీస్ మధ్య జరగనున్న నాలుగో టీ20 క్రికెట్ మ్యాచ్ టికెట్ల బ్లాక్ మార్కెటింగ్ వ్యవహారాన్ని హైదరాబాద్‌లోని గోషామహల్ పోలీసులు వెలుగులోకి తెచ్చారు. టికెట్లను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి విక్రయానికి సిద్ధంగా ఉంచిన 'నాట్ ఫర్ సేల్' అని ముద్రించిన 11 కాంప్లిమెంటరీ టికెట్లతో పాటు ఐదు మొబైల్ ఫోన్లు, ఒక సుజుకి యాక్సెస్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, నిందితులు వాట్సాప్ స్థితి, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా క్రికెట్ టికెట్ల విక్రయానికి ప్రచారం చేసినట్లు గుర్తించారు. సాధారణంగా విక్రయించడానికి ఉద్దేశించని కాంప్లిమెంటరీ టికెట్లను అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా, టికెట్లు ఎక్కడి నుంచి వచ్చాయి, వాటిని ఎవరెవరికి విక్రయించేందుకు ప్రయత్నించారు అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులు హైదరాబాద్ క్రికెట్ సంఘం సభ్యుడి ద్వారా ఈ టికెట్లను పొందినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో టికెట్ల కేటాయింపు, వాటి పంపిణీ, అనంతరం జరిగిన పరిణామాలపై దర్యాప్తు ప్రాధాన్యం సంతరించుకుంది. టికెట్లు అందించిన వ్యక్తికి ఈ అక్రమ విక్రయంతో సంబంధం ఉందా లేదా అనే విషయాన్ని నిర్ధారించాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తులో వెల్లడయ్యే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 11 టికెట్లపై 'నాట్ ఫర్ సేల్' అని ముద్రించి ఉంది. వీటిని అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు. టికెట్లతో పాటు ఐదు మొబైల్ ఫోన్లు, ఒక సుజుకి యాక్సెస్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.








## ఢిల్లీ నిరసనలపై దాఖలైన పిటిషన్లపై నేడు సుప్రీంకోర్టు విచారణ

**న్యూఢిల్లీ, మహా :** దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకున్న నిరసనల పరిణామాలపై దాఖలైన పలు పిటిషన్లపై బుధవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిరసనల విషయంలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించారంటూ జర్నలిస్టులు దాఖలు చేసిన పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ మంగళవారం ధర్మాసనం ఎదుట ప్రస్తావించారు. దీనిపై స్పందించిన భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్.. ఈ పిటిషన్లపై విచారణ జరపాలంటే సంబంధిత కేసుకు సంబంధించిన సమగ్ర ఫైళ్లను పరిశీలించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై విచారణను స్వీకరిస్తామని స్పష్టం చేస్తూనే, నేడు అది సాధ్యం కాదని, రేపు విచారణ చేపడతామని తెలిపారు. మరోవైపు, నిరసనల సమయంలో న్యాయవాదులపై దాడులు జరిగాయంటూ బార్ సభ్యులు దాఖలు చేసిన మరో పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది సీయూ సింగ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ వ్యవహారాన్ని అత్యవసరంగా నేడే విచారించాలని ఆయన కోరగా, నేడు విచారణ జరపడం సాధ్యపడదని సీజేఐ స్పష్టం చేశారు. ధర్మాసనంలోని జస్టిస్ మోహన జ్వరంతో, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ బాధ్యతతో విచారణకు హాజరయ్యారని ఈ సందర్భంగా సీజేఐ ప్రస్తావించారు. పిటిషన్లలో ఉన్న సాంకేతిక లోపాలను ముందుగా సరిదిద్దుకోవాలని న్యాయవాదులకు సూచించారు. లోపాలు సరిచేస్తే సంబంధిత పిటిషన్లన్నింటినీ విచారణ జాబితాలో చేరుస్తామని **చెప్పారు. బుధవారం ఉదయం 11**:00 నుంచి 11:30 గంటల మధ్య వీటిపై విచారణ చేపట్టే అవకాశముందని పేర్కొంటూ, ఇవి అత్యంత తీవ్రమైన అంశాలని, లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

## రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట

న్యూఢిల్లీ, మహా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై 2019 నాటి వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై మహారాష్ట్రలో కొనసాగుతున్న పరువు నష్టం కేసులో సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో దిగువ కోర్టులో తదుపరి విచారణను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ వ్యవహారంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఫిర్యాదుదారు ఎం.హెచ్. శ్రీశ్రిమాల్‌కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా తమ సమాధానాలు సమర్పించాలని ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. తనకు జారీ చేసిన సమన్లను రద్దు చేయడానికి నిరాకరిస్తూ సెప్టెంబరు 8న బాంబే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.ఈ పరువు నష్టం కేసు 2018లో రాజస్థాన్‌లో జరిగిన రాజకీయ సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు సంబంధించినది. రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందంపై రాజకీయంగా చర్చ జరుగుతున్న సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు పరువు నష్టం కలిగించేలా ఉన్నాయని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు ప్రధానమంత్రితో పాటు ఆయనకు మద్దతు ఇచ్చే వర్గాల ప్రతిష్ఠకు భంగం కలిగించాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీకి చెందిన కార్యకర్తగా తనకు కూడా ఆ వ్యాఖ్యల వల్ల బాధ కలిగిందని ఫిర్యాదుదారు వాదించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మహారాష్ట్రలోని గిర్గావ్ మెజిస్ట్రేట్ కోర్టు 2019 ఆగస్టు 28న రాహుల్ గాంధీపై న్యాయ ప్రక్రియను ప్రారంభిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం ఈ కేసులో ఆయనకు సమన్లు జారీ అయ్యాయి. దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను, ఫిర్యాదు ఆధారంగా ప్రారంభించిన న్యాయ ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ రాహుల్ గాంధీ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల ప్రచార సమయంలో చేసిన రాజకీయ వ్యాఖ్యలను నేరపూరిత పరువు నష్టంగా పరిగణించరాదన్నది ఆయన తరఫు వాదనగా ఉంది. తన వ్యాఖ్యలు రాజకీయ ప్రసంగంలో భాగమని, రాజ్యాంగంలోని అధికరణం 19(1)(ఎ) కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛ పరిధిలో వాటిని పరిశీలించాలని ఆయన తరఫు న్యాయవాదులు వాదించారు. అయితే సెప్టెంబరు 8న బాంబే హైకోర్టు ఆయన అభ్యర్థనను తిరస్కరించింది. దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను రద్దు చేయడానికి నిరాకరిస్తూ, కేసు విచారణలో జోక్యం చేసుకోలేదు. దీంతో రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బాంబే హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ల ధర్మాసనం మంగళవారం విచారించింది. రాహుల్ గాంధీ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి వాదనలు వినిపించారు. ఈ అంశానికి సంబంధించి సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించినట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన ధర్మాసనం మహారాష్ట్ర ప్రభుత్వానికి, ఫిర్యాదుదారు ఎం.హెచ్. శ్రీశ్రిమాల్‌కు నోటీసులు జారీ చేసింది.



## విజయదశమి నాడు కొత్త పార్టీ ప్రకటన

**నాది బాల్ ఠాక్రే పాత్ర: విజయసాయిరెడ్డి.**

హైదరాబాద్, మహా . నూతన రాజకీయ పార్టీ ఏర్పాటుపై వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి కీలక ప్రకటన చేశారు. రానున్న విజయదశమి పర్వదినం నాడు కొత్త పార్టీ వివరాలను అధికారికంగా వెల్లడిస్తానని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ పోస్టు పెట్టారు. ప్రస్తుతం నవరాత్రి పవిత్ర దినాల్లో తన పార్టీ పేరు, జెండా, విధివిధానాలు (అజెండా) సిద్ధమవుతున్నాయని, దసరా నాటికి వీటన్నింటినీ ప్రజల ముందుకు తెస్తానని పేర్కొన్నారు.తాను నూతన పార్టీ పెడుతున్నాననే ప్రకటనతో కొందరు తనపై విమర్శలు గుప్పిస్తున్నారని, అలాంటి వారి చౌకబారు ప్రచారాలకు తాను ఎలాంటి విలువా ఇవ్వబోనని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పాతుకుపోయిన రెండు కుటుంబ పార్టీలపై తిరుగుబాటు జెండా ఎగురవేస్తున్నామని, రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ మెరికల్లాంటి సరికొత్త నాయకత్వాన్ని తయారు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. పార్టీలో యువతకే పెద్దపీట వేస్తామని ఉద్ఘాటిస్తూ.. "తన పార్టీలో అధికారం జెన్-జీ (యువతరం)ది, నాది బాల్ ఠాక్రే పాత్ర" అని ఆయన మరోసారి తేల్చిచెప్పారు.



## ఎల్బీనగర్ హయత్ నగర్ డబల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్

- 5 రోప్ వే లకు కేంద్రం ఆమోదం
- రాష్ట్రంలోని పలు కీలక రహదారులు, ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం
- వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**న్యూఢిల్లీ, మహా :** ఎల్బీనగర్ హయత్ నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం సహా తెలంగాణ రాష్ట్రంలోని పలు కీలక రహదారులు, ప్రాజెక్టులకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంగళవారం ప్రత్యేకంగా భేటీ అయి పలు ప్రాజెక్టులపై చర్చించారు. కృష్ణా నదిపై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్ శ్రీశైలం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు విజ్ఞప్తిపై స్పందించిన నితిన్ గడ్కరీ.. కొత్తగా డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ భేటీలో తెలంగాణ రహదారుల రంగానికి సంబంధించి మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పర్వతమాల పథకం ద్వారా తెలంగాణలో 5 రోప్‌వేల ఏర్పాటుకు, సేతు బంధన్ పథకం ద్వారా 3 ఆర్‌వోబీల నిర్మాణానికి కేంద్రమంత్రి గడ్కరీ ఆమోదం తెలిపారు. హైదరాబాద్ అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంపై సానుకూలంగా స్పందించారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోని 34 పనులకు సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయాలని కోరగా అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కేంద్ర మంత్రి గడ్కరీ ఆదేశించారు. వీటితో పాటు పుల్లూరు అలంపూర్ జట్రపోలు పెంట్లవెల్లి కొల్లాపూర్ లింగాల అచ్చంపేట డిండి దేవరకొండ మల్లేపల్లి నల్గొండ రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించాలని చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారని తెలుస్తోంది. హైదరాబాద్‌లో నవంబర్ 19 నుండి 22 వరకు జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలకు కేంద్రమంత్రిని ఆహ్వానించగా, అందుకు నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించి తప్పకుండా హాజరవుతానని తెలిపారు.నితిన్ గడ్కరీ, కోమటి రెడ్డి ప్రత్యేక భేటీలో ప్రస్తావనకు వచ్చిన అంశాలు ఎల్బీనగర్ హయత్ నగర్ డబల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది. కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన నితిన్ గడ్కరీ. హైదరాబాద్ శ్రీశైలం NH 765పై ఎలివేటెడ్ కారిడార్ కి విజ్ఞప్తిపై కొత్త డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పర్వతమాల పథకం ద్వారా తెలంగాణకు 5 రోప్ వే లకు కేంద్రమంత్రి గడ్కరీ ఆమోదించారు. హైద్రాబాద్ అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే పై సానుకూలంగ స్పందించిన కేంద్ర మంత్రి. సేతు బంధన్ పథకం ద్వారా 3 ఆర్ఓబి లకు ఆమోదం లభించింది. తెలంగాణ లో 34 పనులకు సీఆర్ఐఎఫ్ నిధులను మంజూరు చేయాలని మంత్రి కోరగా కేంద్ర అధికారులను ఆదేశాలు ఇచ్చారు. పుల్లూరు అలంపూర్ జట్రపోలు పెంట్లవెల్లి కొల్లాపూర్ లింగాల అచ్చంపేట డిండి దేవరకొండ మల్లేపల్లి నల్గొండ రాష్ట్ర హైవే లను జాతీయ హై వే లుగా మార్చాలని కోరడంతో సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి. హైదరాబాద్ లో నవంబర్ 1922 వరకు జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ కు మంత్రి ఆహ్వానించగా.. వస్తానని చెప్పిన కేంద్ర మంత్రి గడ్కరీ.

## యూపీఐ బాదుడుకు ఉపశమనం

**న్యూఢిల్లీ, మహా:** యూపీఐ లావాదేవీలకు సంబంధించి మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీల అమలును దీపావళి తర్వాతకు వాయిదా వేసినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించింది. పండగ సీజన్‌లో వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. వ్యాపారులు చేసిన విజ్ఞప్తుల మేరకు ఛార్జీల అమలును నవంబర్ రెండో వారానికి వాయిదా వేసినట్లు పేర్కొంది.దీపావళి సందర్భంగా మార్కెట్లలో కొనుగోళ్లు, డిజిటల్ చెల్లింపులు పెరిగే అవకాశం ఉంది. ఈ సమయంలో కొత్త ఛార్జీల విధానం అమల్లోకి వస్తే వ్యాపారులపై అదనపు భారం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీంతో పండగ సీజన్ ముగిసిన తర్వాతే ఎండీఆర్ ఛార్జీలను అమలు చేయాలని ఎన్‌పీసీఐ నిర్ణయించినట్లు సమాచారం. మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అనేది డిజిటల్ చెల్లింపులను స్వీకరించే వ్యాపారులకు సంబంధించిన లావాదేవీల ఛార్జీ. దీని అమలును నవంబర్ రెండో వారానికి వాయిదా వేయడంతో వ్యాపారులకు తాత్కాలికంగా ఊరట లభించనుంది. అయితే, ఏయే లావాదేవీలకు ఛార్జీలు వర్తిస్తాయి? ఎంత మేర వసూలు చేస్తారు? అనే పూర్తి వివరాలు అధికారిక మార్గదర్శకాల ద్వారా స్పష్టత రావాల్సి ఉంది.

ABN తెలుగు

మహా పత్రిక

బుధవారం,
హైదరాబాద్
14-10-2026

మహా ప్రత్యేకం



# ఉత్సాహంగా.. విజయవాడ ఉత్సవ్

**స్పెషల్ ఎట్రాక్షన్ గా తమిళనాడు సీఎం విజయ్**
**తెలుగులో ప్రసంగం ప్రారంభించిన విజయ్**
**విజయ్ ను స్వాగతించిన చంద్రబాబు, నారా లోకేష్**
**విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లింది: సీఎం చంద్రబాబు**



(మహా నెట్ వర్క్ )
తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లిందని సీఎం చంద్రబాబు అన్నారు. ఆయన తొలిసారి ఏపీకి వచ్చారని తెలిపారు. ఉండవల్లిలో భేటీ తర్వాత.. పున్నమిఘాట్‌లో నిర్వహించిన విజయవాడ ఉత్సవ్‌లో ఇద్దరు సీఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. పార్టీ పెట్టిన రెండేళ్లకే విజయ్ సీఎం అయ్యారని,తమిళనాడు అభివృద్ధికోసం కంకణం కట్టుకున్నారని కితాబిచ్చారు. విజయవాడ ఉత్సవ్‌ను అధికారులు, స్థానిక నేతలు ఘనంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.





### విజయ్ స్పీచ్ కు విజయవాడ ఫిదా

తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ విజయవాడ పర్యటన సక్సెస్ ఫుల్ గా సాగింది. ఆయన అధికార పర్యటన అంతా ఆద్యంతం ఆసక్తిని రేపింది. ఉత్సాహభరితంగా కూడా సాగింది. విజయ్ కి అడుగడుగునా టీడీపీ నాయకులు మంత్రులు ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే సాదరంగా రిసీవ్ చేసుకున్నారు. ఏపీ తమిళనాడు ముఖ్యమంత్రుల మధ్య పూర్తిగా సానుకూల వాతావరణంలో చర్చలు సాగాయి. తమిళనాడు ఏపీ పరస్పరం సహకరించుంటాయని చంద్రబాబు చెప్పారు.






### ఫుల్ ఆఫ్ అట్రాక్షన్

విజయ్ విజయవాడ ఉత్సవ్ లో ఫుల్ ఆఫ్ ఎట్రాక్షన్ అయ్యారు. వేదిక మీద ఆయన ప్రసంగించినది కేవలం ఒక నిముషం ముప్పయి సెకన్లు మాత్రమే. అయితే ఆయన తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్నారు. అంతే కాదు ఆయన హుందాగా చేసిన ఈ స్పీచ్ ని కూడా అంతా ఆస్వాదించారు. చంద్రబాబు పట్ల గౌరవంతో కూడిన అభిమానం ఆయన చూపించారు. అలాగే స్థానిక ప్రజల ప్రేమకు కూడా ఆయన ముగ్ధులు అయ్యారు. విజయ్ సీఎం అయ్యాక పక్క రాష్ట్రం వెళ్ళి ఒక సభలో పాల్గొనడం అయితే జరిగింది లేదు. కానీ ఏపీలో ఆయనకు దక్కిన ఈ ఘన స్వాగతం మాత్రం ఆయనతో పాటు టీవీక వర్గాలకు కూడా ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంది. అందుకు గానూ చంద్రబాబుని కూడా అభినందించాలి.








### అందరికీ నమస్కారం అంటూ చేతులెత్తి

విజయ్ అయితే విజయవాడ ఉత్సవ్ లో తెలుగులో మాట్లాడి అందరినీ అలరించారు. అందరికీ నమస్కారం అంటూ విజయ్ తన స్పీచ్ ప్రారంభించడంతో జనాలు అంతా ఉత్సాహంగా ప్రతిస్పందించారు. తాను నవరాత్రి ఉత్సవాలలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని విజయ్ చెప్పారు. అందరికీ నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ వాసుల ఆతీధ్యానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇక తనను విజయవాడకు ఆహ్వానించిన ఏపీ సీఎం చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను అని అలాగే ప్రజల అభిమానాన్ని గుండెల్లో పెట్టుకుంటాను అని విజయ్ చెబుతూంటే సభ అంతా హోరెత్తింది. తాను నదుల అనుసంధానం గురించి ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చించేందుకు వచ్చాను అని విజయ్ తెలిపారు.




# మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో.. ఘనంగా బతుకమ్మ సంబరాలు..

**మణుగూరు, మహా** : మణుగూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలకు అనుగుణంగా ఆడిపాడుతూ సందడి చేశారు. దీంతో ఐటీఐ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపాల్ ఓ.సారంగపాణి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రకృతిని, పూలను ఆరాధించే ఈ పండుగ తెలంగాణ ప్రజల ఆత్మీయతకు, ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భావితరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ టివిఎస్ జ్యోతిరాణి, ఏటీవోలు ఎం శ్రీనివాసరావు, జివి కృష్ణారావు, ఏ నర్సయ్య, వేణుగోపాల్‌నాయుడు, సీనియర్ అసిస్టెంట్ సాధన, ఏటీసీ మాస్టర్ ట్రైనర్లు పూర్ణచంద్రరావు, కార్తికేయతోపాటు ఏటీసీ, ఐటీఐ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# రీసర్వేలో తప్పులకు తావివ్వొద్దు

- భూముల హద్దులు, విస్తీర్ణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- గడువులోగా పనులు పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం, మహా** : భూముల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల్లో ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని సూచించారు. మంగళవారం పెనుబల్లి మండలం తుమ్మలపల్లి, కల్లూరు మండలం రఘునాథగూడెం, తల్లాడ మండలం లక్ష్మీపురం రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. భూ రికార్డుల్లోని వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చుకోవాలని, సర్వేలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. రైతులు, భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, భూముల వివరాలపై అభ్యంతరాలు వస్తే నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. సర్వే బృందాలు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలన్నారు. అధికారులు రోజువారీ పురోగతిని సమీక్షిస్తూ, పనుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తహశీల్దార్లు కె. కరుణాకర్‌రెడ్డి, జి. వీరభద్ర నాయక్, కె. బ్రహ్మేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# దసరా సంబరాలను ఘనంగా నిర్వహించాలి..

- ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి..
- సింగరేణి జీఎం దుర్గం రామచందర్

**మణుగూరు, మహా** : సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే, దసరా మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో పండుగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణుగూరు పీవీ కాలనీలోని భద్రాద్రి స్టేడియంలో అక్టోబర్ 18న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే సంబరాలు, అక్టోబర్ 20న దసరా మహోత్సవం సందర్భంగా రామలీలా, సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతోపాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎవరికీ అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. భద్రాద్రి స్టేడియంలో మైదానాన్ని చదును చేయడంతోపాటు తగిన విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సద్దుల బతుకమ్మ నిమజ్జనం కోసం చెరువు వరకు సురక్షితమైన మార్గాన్ని సిద్ధం చేసి, ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకోవాలని, అవసరమైన భద్రతా సిబ్బందిని నియమించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌వో టు జీఎం డి వెంకట రామారావు, ఏజీఎంలు సీహెచ్ రాంబాబు, ఎస్ రమేష్, ఏరియా ఇంజినీర్ పి మదన్ నాయక్, కొండాపురం ఏజెంట్ జె. వేణుమాధవ్, మణుగూరు ఓసీ ప్రాజెక్టు అధికారి ఈ. శ్రీనివాస్, డీజీఎంలు టి శ్రీకాంత్, జి శివప్రసాద్, డిప్యూటీ సీఎంవో డాక్టర్ జ్యోతిర్మయి, ఏరియా సేఫ్టీ అధికారి జి నాగేశ్వరరావు, సీనియర్ ఎస్టేట్స్ అధికారి కె స్వప్న, ఫైనాన్స్ మేనేజర్ పి రమేష్, ఏరియా సెక్యూరిటీ అధికారి కె శ్రీనివాస్, ఎస్ఈ (ఈఅండ్ఎం) ఎస్ జోసెఫ్‌బాబు, డిప్యూటీ ఎంఎం బి శ్యామ్‌ప్రసాద్, డిప్యూటీ ఎస్ఈ రాజేంద్రప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారులు కె శ్రీనివాస్, వి రామేశ్వరరావు, ఎస్ చంద్రశేఖర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ (పర్సనల్) బి సాయిమౌనిక తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే కృషి ఫలితం!

# సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల వాటా

- కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్
- సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే మట్టా రాగమయి
- ఐఎన్‌టీయూసీ నేత కోటేశ్వరరావు కృతజ్ఞతలు



**సత్తుపల్లి, అక్టోబర్ 13**:మహా : సింగరేణి కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చొరవ చూపారని ఐఎన్‌టీయూసీ సత్తుపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు తెలిపారు. కార్మికులకు ఇచ్చిన మాటకు అనుగుణంగా వారి సమస్యలను శాసనసభలో ప్రస్తావించడంతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన కార్మిక సంక్షేమ చర్యల నేపథ్యంలో ఎమ్మెల్యేకు, ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. జనక్ ప్రసాద్‌కు కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఐఎన్‌టీయూసీ నాయకుడు డాక్టర్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు కోటేశ్వరరావు వివరించారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించేలా ఎమ్మెల్యే కృషి చేశారని పేర్కొన్నారు.

**కార్మికులకు లాభాల వాటా..**
**కాంట్రాక్టు సిబ్బందికి బోనస్**

సింగరేణి సంస్థ ఆర్జించిన లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని కోటేశ్వరరావు తెలిపారు. శాశ్వత ఉద్యోగులకు సగటున ఒక్కొక్కరికి రూ.1,53,912 చొప్పున అందనుండగా, 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 చొప్పున బోనస్ ప్రకటించినట్లు వివరించారు. ఈ నిర్ణయాలు కార్మికులకు ఆర్థికంగా ఊరటనిస్తాయని పేర్కొన్నారు.

**పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు**

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వారసత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులకు నియామక పత్రాలు అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కార్మికుల పేర్లలోని మారుపేర్ల సమస్యలను పరిష్కరించడం, కొవిడ్ సమయంలో ఉద్యోగాలు కోల్పోయిన అర్హులైన కార్మికులకు తిరిగి ఉద్యోగంలో చేరే అవకాశం కల్పించడం వంటి అంశాలపైనా నిర్ణయాలు వెల్లడయ్యాయని పేర్కొన్నారు. కార్మిక కుటుంబాలకు గృహవసతి కల్పించేందుకు నెహ్రూ హౌసింగ్ కాలనీల అభివృద్ధి, శిథిలావస్థకు చేరిన డిటైప్ క్వార్టర్ల స్థానంలో మెరుగైన నివాసాలు నిర్మించడం, ఏరియా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించడం, ఆసుపత్రుల్లో ఉన్నతస్థాయి వైద్య సేవలు అందించడం వంటి చర్యలు కూడా కార్మికులకు ప్రయోజనం చేకూర్చనున్నాయని తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు, ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. జనక్ ప్రసాద్‌కు సింగరేణి కార్మికుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కోటేశ్వరరావు వెల్లడించారు.

# సింగరేణి ఉద్యోగులకు శుభవార్త

- ఒక్కొక్కరికి రూ.1,53,912 లాభాల వాటా
- 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి
- 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్
- సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం
- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం
- కార్మికుల సమస్యల పరిష్కారానికి మానవీయ దృక్పథం
- సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాకులు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ప్రకటించారు. మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ నిర్ణయంతో ప్రయోజనం పొందనున్నారని, 29717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే 596 కోట్ల రూపాయలను లాభాల వాటాగా కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ అందించామని ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు.

**సింగరేణి ఉద్యోగ కార్మికులకు సొంతింటి కల సాకారం**

సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తామని కార్మికుల సంక్షేమం వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని బట్టి విక్రమార్క వెల్లడించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలని తెలిపారు. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని తెలిపారు. సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్ఠంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఆయా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి వీలైనంత ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని మానవీయంగా వ్యవహరించాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశమని భట్టి విక్రమార్క వివరించారు.



# సింగరేణి కార్మికుల సంక్షేమానికి కీలక నిర్ణయాలు..

- కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

**మణుగూరు, మహా** : సింగరేణి కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు హర్షణీయమని పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులపై ఆదాయపు పన్ను భారం తగ్గించడం, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను 15 రోజుల్లో పూర్తి చేయడం, ఇళ్ల స్థలాల పంపిణీ, మెరుగైన వైద్య సదుపాయాల కల్పన వంటి నిర్ణయాలు కార్మికులకు ప్రయోజనం చేకూరుస్తాయని అభిప్రాయపడ్డారు. సింగరేణి శాశ్వత ఉద్యోగులకు సగటున రూ.1,53,912 చొప్పున దసరా బోనస్, కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 చొప్పున బోనస్ అందించాలనే నిర్ణయం కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, వారి కుటుంబాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చొరవ చూపిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. సంబంధిత మంత్రులు, సింగరేణి అధికారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.



# సమర్థవంతమైన అధికారులతోనే న్యాయం

**సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు**

భద్రాద్రి కొత్తగూడెం, మహా: సమర్థవంతమైన అధికారులతోనే అన్ని వర్గాల వారికి సంపూర్ణ న్యాయం జరుగుతుందని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరు కనబరిచి రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ కు పొన్నెకంటి సంజీవ రాజు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన సమాచార హక్కు వారోత్సవాలు-2026 కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా కలెక్టర్ అవార్డు స్వీకరించడం జిల్లాకు గర్వకారణం అన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబుదారీతనాన్ని పెంపొందించడంతో పాటు సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం చూపిన చొరవకు గుర్తింపుకు ఈ పురస్కారం అన్నారు. సమర్థవంతంగా పనిచేసే అధికారుల వల్లే సామాన్య ప్రజలకు న్యాయం జరిగే అవకాశాలు మెరుగుపడతాయని సమాచార హక్కు చట్టం స్ఫూర్తిని ఆచరణలో చూపిస్తూ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ కు అందిన ఈ అవార్డు భవిష్యత్తులోనూ పారదర్శక పాలనకు ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత ప్రోత్సాహాన్నిస్తుందని పొన్నెకంటి సంజీవ రాజు ఆశాభావం వ్యక్తం చేశారు.



# కుంకుమార్చన లో మున్సిపల్ చైర్‌పర్సన్

ఆదిలాబాద్ మహా : భక్తి, ఆధ్యాత్మికతతో మనసుకు ప్రశాంతత చేకూరుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని మున్నూరు కాపు సంఘ భవనంలోని దుర్గామాత మండపంలో నిర్వహించిన కుంకుమార్చన పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుంకుమ అర్చన అనేది అమ్మవారిపై భక్తి, విశ్వాసాలకు ప్రతీక అని తెలిపారు. అమ్మవారికి కుంకుమతో అర్చన చేయడం ద్వారా భక్తులు తమ కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తారని పేర్కొన్నారు. ఇలాంటి పూజా కార్యక్రమాలు మనసుకు ప్రశాంతతను అందించడంతో పాటు ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని అన్నారు.మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో పూజలు, వ్రతాలకు విశిష్టమైన స్థానం ఉందని, వాటిని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదర భావం, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆరోగ్యంతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాంక్షించారు.

## దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా

# భక్తి పారవశ్యం!

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: మండలం లో దుర్గాదేవి నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని భక్తితో పూజించి, లోకకల్యాణం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం భక్తిభావంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పలువురు ప్రజలు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. నవరాత్రుల వేళ పూజలతో పాటు అన్నదానం నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. భక్తి, సేవాభావం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా ఈ కార్యక్రమం నిలిచింది.





# ఎమ్మెల్యే మల్ రెడ్డి సహకారంతో బ్రిడ్జి పనుల్లో వేగం.!

- మరో నెలలో ప్రజలకు అందుబాటులోకి బ్రిడ్జి
- ఉప్పరిగూడ పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 13 మహా**: ఎమ్మెల్యే రంగారెడ్డి సహకారంతో శ్రీఇందు కాలేజీ వద్ద బ్రిడ్జి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పాండురంగారెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, శేరిగూడ శ్రీఇందు కాలేజీ వద్ద మొదలైన బ్రిడ్జి పనులు, నిధుల కొరతతో నిలిచిపోయాయని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో నిలిచిపోయిన బ్రిడ్జి పనులకు నిధులు కేటాయించి, వేగవంతంగా పనులు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. హైదరాబాద్ నాగార్జునసాగర్ రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంగా, స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ముందుగా ఒక లైన్ బ్రిడ్జి పనులు పూర్తి చేసి గత సంవత్సరం క్రితం అందుబాటులోకి తీసుకువచ్చారు. మరొక్క లైన్ బ్రిడ్జి పనులో స్లాబ్ పూర్తి కావడం జరిగిందని, మరో నెలలో ఈ యొక్క బ్రిడ్జి పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఆయన కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల సంక్షేమం రెండును, రెండు కళ్ళలా భావిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# ఈసీఐఎల్, రాధిక జంక్షన్ల అభివృద్ధికి చర్యలు వేగవంతం చేయాలి

- కాప్రా సర్కిల్‌లో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి




**కుషాయిగూడ, మహా**: కాప్రా సర్కిల్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఈసీఐఎల్, రాధిక జంక్షన్లతో పాటు పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రహదారుల విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడంపై ప్రత్యేక దృష్టి సారించారు.

**ఈసీఐఎల్ జంక్షన్ అభివృద్ధికి ప్రాధాన్యం**

ఈసీఐఎల్ జంక్షన్‌లో ఫ్రీ లెఫ్ట్ సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు అవసరమైన పనులను పరిశీలించారు. జంక్షన్ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సోనీ సెంటర్ సమీపంలోని రహదారి క్రాసింగ్ కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారి విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు.

**రాధిక జంక్షన్‌లో భూసేకరణ వేగవంతం**

రాధిక జంక్షన్ అభివృద్ధికి సంబంధించి పరివార్ రెస్టారెంట్, ఆలయం, హెల్మెట్ షాపు వద్ద అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. జంక్షన్ అభివృద్ధితో ట్రాఫిక్ నిర్వహణ మెరుగుపడేలా, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తగ్గేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

**బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు**

పోచమ్మ జంక్షన్ (డీమార్ట్) వద్ద రహదారిని దాటే బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఇందుకు అడ్డంకిగా ఉన్న నీటి పైపులైన్ల మార్పిడి పనులను ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**శ్మశానవాటిక అభివృద్ధికి సంయుక్త పరిశీలన**

చిన్న చెర్లపల్లి శ్మశానవాటికను సందర్శించిన కమిషనర్.. అభివృద్ధికి ఎదురవుతున్న అవరోధాలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఉప్పల్ జోనల్ కమిషనర్, డీసీపీ (లా అండ్ ఆర్డర్), స్థానిక గ్రామస్థులతో కలిసి సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించాలని ఆదేశించారు. స్థానికుల అవసరాలను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి పనులకు అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. భూసేకరణ, యుటిలిటీ లైన్ల మార్పిడి, రహదారుల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి వంటి అంశాల్లో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు మెరుగైన రవాణా సౌకర్యాలు, పౌర సేవలకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు.



# 7.75 కీలోల గంజాయి పట్టివేత

**2.71 కోట్లు ఉంటుందని అధికారుల అంచనా...**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు భారీగా విదేశీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుండి వచ్చిన ఒక భారతీయ ప్రయాణికుడి ల్యాగేజీని తనిఖీ చేయగా, అందులో అక్రమంగా తరలిస్తున్న 7.75 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి (హైగ్రేడ్ వీడ్) లభ్యమైంది. కస్టమ్స్ అధికారుల నుండి సదరు ప్రయాణికుడుతప్పించుకోవడానికి తను తెచ్చిన ఒక ఎలక్ట్రిక్ గీజర్ లోపల ఈ గంజాయిని 73 ప్యాకెట్లలో దాచి ఉంచాడు. పట్టుబడిన ఈ విదేశీ గంజాయి విలువ అంతర్జాతీయ మార్కెట్లో సుమారు రూ. 2.71 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్ డి పి ఎస్) యాక్ట్, 1985 కింద నిందితుడిని అరెస్ట్ చేసి, గంజాయిని సీజ్ చేశారు. ప్రస్తుతం ఈ కేసుపై అధికారులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు.



# భక్తి భావానికి వేదికలు... శరన్నవరాత్రి ఉత్సవాలు

- అమ్మలగన్న అమ్మ.. బెజవాడ దుర్గమ్మ
- మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా

**జవహర్ నగర్, మహా** : .భక్తి భావానికి వేదికలు శరన్నవరాత్రి ఉత్సవాలని, అమ్మలగన్న అమ్మ బెజవాడ దుర్గమ్మయే అని, అమ్మవారి ఆశీస్సులు జవహర్ నగర్ ప్రజలపై ఉండాలని కోరుకున్నట్టు జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సంతోష్ నగర్ కాలనీలో కొలువుదీరిన దుర్గామాత మండపంలో శ్రీనివాస్ గుప్తా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం కుంకుమార్చన చేసి ఆ తర్వాత భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తి భావంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో పాటు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ దుర్గామాతను వేడుకున్నట్టు తెలిపారు. జవహర్ నగర్ అభివృద్ధిలో యువత ముందుండాలని, జవహర్ నగర్ సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి కరుణాకటాక్షాలతో జవహర్ నగర్‌లో సమృద్ధిగా వర్షాలు పడి పాడి పంటలతో తెలంగాణ రాష్ట్రం పచ్చంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రమణప్ప, నరసింహ గౌడ్, సుధాకర్, విజయ, మనోజ్, అనిరుద్, శ్రీమన్నారాయణ, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మహిళలు భక్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులు పట్టివేత

**టాస్క్‌ఫోర్స్ చాకచక్యంగా దాడి.. రెండు వాహనాలు స్వాధీనం**

**పెద్దపల్లి మహా** : మంథని: అక్రమంగా పశువులను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 11 ఆవులతో పాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ములుగు జిల్లా నుంచి కరీంనగర్ పట్టణానికి పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం మంథని మండలం లక్కేపల్లి గ్రామం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను గుర్తించి పట్టుకుంది. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 11 ఆవులతో పాటు ఒక మహీంద్రా క్యాంపర్, ఒక అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనం ఉన్నాయి.ఈ ఘటనకు సంబంధించి ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ సోమన్న (45), ఎం.డి. తుఫాన్ (37)లను పోలీసులు గుర్తించారు అని తెలిపారు.స్వాధీనం చేసుకున్న పశువులు, వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మంథని పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు



# అమ్మలగన్న అమ్మ... మాత అన్నపూర్ణేశ్వరి

- లక్ష్మీ నరసింహ కాలనీ ఫేస్ 1 లో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు
- చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో

**జవహర్ నగర్, మహా** : అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ ఆ మాత అన్నపూర్ణేశ్వరి దేవియే ...అని లక్ష్మీ నరసింహ కాలనీ ఫేస్ 1 చత్రపతి శివాజీ టీం యూత్ సభ్యులు పేర్కొన్నారు. శ్రీ లక్ష్మీనరసింహ కాలనీ ఫేస్ 1 లో దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లోకానికి ఆహారాన్ని ప్రసాదించే అన్నపూర్ణాదేవి అవతారాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు ఆర్సి శ్రీకాంత్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాత అన్నపూర్ణాదేవి ప్రజలను చల్లంగా చూసి ఈతి బాధలు పడి లేకుండా రక్షించాలని వేడుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు ఇంద్రపాల సత్యనారాయణ, అంబాల విష్ణు, దావత్ అరుణ్, అంబాల మల్లేష్, తదితరులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. భవాని మాలలు ధరించిన చంద్రయ్య, సుజాత, దత్త, ప్రసన్న రావు, కనక లక్ష్మీ, యశ్వంత్, అరుషి, సాయి, లక్ష్మీ, శ్రీనివాస్, వెంకటేష్, సంతోష్, శ్యామల, చితారి, హరీష్, సురేష్, కమలాకర్, శ్రావణ్ తదితర కాలనీవాసులు యూత్ సభ్యులు అమ్మవారి సేవలో తరించి పునీతులయ్యారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం....

రాజేంద్రనగర్ మహా ; మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని 178.10 లక్షలతో సీసీ రోడ్ల పనులకు రూ 67 లక్ష లతో టి ఎన్ జీవో్స పార్క్ అభివృద్ధి పనులకు మంగళవారం జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం జీహెచ్‌ఎంసీ సుమారు 178.10 లక్షల అంచనా వ్యయంతో ఈ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మల్లయ్య, ఇంజనీరింగ్ అధికారులు పార్టీ నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం

రాజేంద్రనగర్ మహా ; శంషాబాద్ మండలం చౌదరిగుడ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం అన్నారు. మంగళవారం మండలంలోని చౌదరిగుడ గ్రామంలో సిసి రోడ్డు పనులకు సర్పంచ్ భూమి పూజ చేశారు. సందర్భంగా మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమం, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ్ రాజ్, నర్కూడ సర్పంచ్ శేఖర్ యాదవ్, సబిత, మంజుల, అరుణ, జయమ్మ, రాజు, మోహన్ రావు, మల్లేష్, పెంటయ్య, ఆంజనేయులు గౌడ్, చింటూ, విజయ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.




# కేశవ్ మెమోరియల్ న్యాయ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిన న్యాయ విద్యార్థినులు

**నారాయణగూడ, మహా** : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ న్యాయ శాస్త్ర క్యాంపస్‌లో విద్యార్థినులు ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ వేడుకల్లో న్యాయ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంప్రదాయ పట్టు వస్త్రాలు ధరించి, రంగురంగుల బతుకమ్మల చుట్టూ చేరిన విద్యార్థినులు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాలు ఆడారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో', 'మా ఊరి బతుకమ్మ ఉయ్యాలో.. మా ఇంటి బతుకమ్మ ఉయ్యాలో' అంటూ పాటలు పాడుతూ సందడి చేశారు. గౌరమ్మను స్మరిస్తూ సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పారు. సంప్రదాయ కళలు, పాటలు, కోలాటాల ద్వారా తెలంగాణ సంస్కృతి, వారసత్వ పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషించారు. క్యాంపస్ ప్రాంగణం బతుకమ్మ పాటలతో సందడిగా మారింది. బతుకమ్మ వేడుకల్లో చిలుకూరి లలిత పాల్గొన్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీసర్వే

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్, మహా ప్రతినిధి : భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి, భూ రికార్డుల్లో పారదర్శకతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే చేపడుతోందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం చెన్నూర్ మండలం కోనంపేటలో జరిగిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో తొలి విడతగా ప్రతి మండలంలో 2 గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రతి భూమిని సాంకేతిక పరికరాలతో కొలిచి హద్దులు, విస్తీర్ణం నిర్ధారించి కొత్త మ్యాపులు, పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తామన్నారు. రైతులకు వారం ముందే నోటీసులు ఇస్తామని, ఆ రోజు రైతులు పొలం వద్ద ఉండాలని సూచించారు. గతంలో నెన్నెల, తాండూరు మండలాల్లో చేసిన రీసర్వేలో 95 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. అంతకుముందు చెన్నూర్ లో బీసీ వసతి గృహం, 100 పడకల ఆసుపత్రి, గోదావరి పుష్కర ఘాట్, అమృత్ 2.0 పనులు, సోమనపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను కలెక్టర్ పరిశీలించారు.

# ప్రోటోకాల్ పాటించని అధికారులు

- రిమ్స్ లో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన
- పట్టణ ప్రథమ పౌరురాలికి అందని ఆహ్వానం
- కలెక్టర్ కు మున్సిపల్ చైర్ పర్సన్ ఫిర్యాదు
- అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ

**ఆదిలాబాద్ మహా** : ప్రభుత్వ అభివృద్ధి పనుల శంఖుస్థాపనలో అధికారులు ప్రోటోకాల్ విస్మరించారు. ఆదిలాబాద్ పట్టణం లోని రిమ్స్ ఆసుపత్రిలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 11 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల శంఖుస్థాపన కార్యక్రమం విషయంలో పట్టణ ప్రథమపౌరురాలికి కనీస సమాచారమందించలేదు. అయితే ఇప్పటికే అత్యవసరంగా పనులు ప్రారంభమైనప్పటికీ, మరోసారి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించి తనను ఆహ్వానించకపోవడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.ప్రజాప్రతినిధులకు తగిన ప్రోటోకాల్ పాటించకుండా కార్యక్రమాలు నిర్వహించడం సరైన పద్ధతి కాదని వివరించారు. దీంతో జిల్లా అడిషనల్ కలెక్టర్ సంబంధిత ఆర్ అండ్ బి అధికారులతో పాటు రిమ్స్ డైరెక్టర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోనున్నట్టు నోటీసు లో వెల్లడించారు. ఈ వ్యవహారంపై జాతీయ , రాష్ట్ర మహిళా కమిషన్ లకు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.



BANDARI ANUSHA SATISH, B.Sc
MUNICIPAL CHAIRPERSON
ADILABAD MUNICIPALITY

Ward No. 45, Bhuktapur
Adilabad - 504001(T.S)
Mobile : 9951590999
9848489815
E-mail: bandarianusha9999@gmail.com

Date: 12-10-2026.

TO:
The District Collector & District Magistrate
Collectorate Office
Adilabad District, Telangana

SUBJECT: Official complaint regarding deliberate breach of protocol and misuse of authority during the inauguration of ₹11 Crore RIMS developmental works – Request for strict inquiry and penal action.

Respected Sir,

I am writing to register a formal complaint regarding the high-handed behaviour and severe protocol violation committed by officials of the Roads & Buildings (R&B) Department and the administration of Rajiv Gandhi Institute of Medical Sciences (RIMS).

Developmental works with an outlay of ₹11 Crores were formally inaugurated at RIMS. Despite holding the responsible office of Chairperson, no invitation, notice, or intimation was extended to me for the event. The responsible entities include:

- The Executive Engineer and field engineers of the R&B Department;
- The Director and Administrative Department of RIMS;
- The executing private contractors involved in the project.

Conducting public-funded inaugural programmes by deliberately bypassing elected leadership violates fundamental government protocols. I urge your office to take immediate cognisance, issue show-cause notices to the errant officials, and take stringent action against all those responsible.

Thanking you sir,

Yours faithfully,

(BANDARI ANUSHA)
CHAIRPERSON,
Municipal Council Adilabad.

1) Copy submitted to The Hon'ble Sri Jupally Krishna Rao Garu, Minister for Prohibition & Excise, Tourism & Culture and Archaeology, Government of Telangana, Secretariat, Hyderabad.
2) Copy submitted to The Hon'ble Chairperson, Telangana State Commission for Women, 2nd Floor, South Block, Buddha Bhavan, Ranigunj, M.G. Road, Secunderabad – 500003, Telangana.
3) Copy submitted to The Hon'ble Chairperson, National Commission for Women (NCW), Plot No. 21, Jasola Institutional Area, New Delhi – 110025.



# గుండా మల్లేష్‌కు సీపీఐ నాయకుల నివాళులు

**క్యాతనపల్లి మహా :** బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా, పేద ప్రజల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన యోధుడు కామ్రేడ్ గుండా మల్లేష్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. రామకృష్ణాపూర్‌లోని సీపీఐ కార్యాలయంలో గుండా మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ తో కలిసి ఆయన సేవలను స్మరించుకుంటూ, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనకు ఆయన చేసిన పోరాటం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వనం సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



## బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్లకు వాణీ ప్రసాద్ ఆదేశాలు

పెద్దపల్లి మహా: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారి వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పలు సూచనలు చేశారు.గ్రామాలు, పట్టణాల్లో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేడుకలు జరిగే ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్‌తో పాటు భద్రతా సదుపాయాలు కల్పించాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే జిల్లాల్లో పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల డీపీఆర్‌ల తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా అప్పగించాలని ఆదేశించారు. హరిత హోటళ్ల నిర్మాణానికి పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో పాటు పలువురు అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు లాభాల పండుగ!

- లాభాల్లో 34 శాతం వాటా ప్రకటన.. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్
- 15 రోజుల్లో పెండింగ్ వారసత్వ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి చర్యలు
- కార్మికుల సొంతింటి కల సాకారానికి ప్రభుత్వ హామీ



**పెద్దపల్లి మహా**: సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల ఆర్థిక భద్రత, పెండింగ్ ఉద్యోగాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటనలు చేసింది. తెలంగాణ ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సింగరేణి పరివాహక ప్రాంత శాసనసభ్యులు, సింగరేణి యాజమాన్యం ప్రతినిధులతో కలిసి పెద్దపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు.

**సింగరేణి లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా**

సింగరేణి సంస్థ సాధించిన రూ.1,754 కోట్ల లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా ప్రకటించినట్లు సమావేశంలో వెల్లడించారు. సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల శ్రమకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. లాభాల్లో వాటా పంపిణీ కార్మిక కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పడుతుందని పేర్కొన్నారు.

**కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్**

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కూడా ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. ఒక్కో కాంట్రాక్ట్ కార్మికుడికి రూ.5,500 చొప్పున బోనస్ అందించనున్నట్లు వెల్లడించారు. రెగ్యులర్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల సేవలను గుర్తిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే, గతంలో ప్రకటించిన దసరా బోనస్ కింద ఒక్కో కార్మికుడికి రూ.1,10,250 అందనున్నట్లు పేర్కొన్నారు. లాభాల వాటా, బోనస్‌కు సంబంధించిన చెల్లింపుల వివరాలు కార్మికులకు ప్రాధాన్యత కలిగిన అంశాలుగా నిలిచాయి.

**కార్మికుల సొంతింటి కల సాకారం దిశగా చర్యలు**

సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సమావేశంలో వెల్లడించారు. కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడంతో పాటు ఆర్థిక భద్రత, నివాస సదుపాయాల అంశాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

**15 రోజుల్లో పెండింగ్ వారసత్వ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి చర్యలు**

సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న వారసత్వ ఉద్యోగాల అంశంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ విచారణలు, పెండింగ్ కేసుల కారణంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కార్మికుల పిల్లలకు న్యాయం జరిగేలా సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఈ సమస్యకు సంబంధించి 15 రోజుల్లో ఉద్యోగాల కల్పన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని ప్రకటించినట్లు పేర్కొన్నారు. దీంతో దీర్ఘకాలంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల్లో ఆశలు చిగురించాయి.

సింగరేణి ప్రాంతంలో ఉద్యోగాలు, సంక్షేమంపై ఆశలు తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి సంస్థ వేలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉంది. బొగ్గు ఉత్పత్తిలో కార్మికుల శ్రమ ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో లాభాల్లో వాటా, కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్, సొంతింటి కల సాకారం, పెండింగ్ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి చర్యలు వంటి ప్రకటనలు సింగరేణి ప్రాంతంలో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన హామీల అమలు, ఉద్యోగాల ప్రక్రియలో పురోగతి, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన తదుపరి నిర్ణయాలపై సింగరేణి కార్మిక కుటుంబాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.



## వెట్టిచాకిరీ నిర్మూలనకు స్వేచ్ఛా రథం

- బాధితులకు అండగా నిలవాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, మహా**: వెట్టిచాకిరీ నిర్మూలన, నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. వెట్టిచాకిరీ బాధితులకు సకాలంలో ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'స్వేచ్ఛా రథం'ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైనా వెట్టిచాకిరీ ఘటనలు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాధితులకు అండగా నిలిచి, వారికి ప్రభుత్వ సహాయం అందేలా చూడాలని పేర్కొన్నారు. వెట్టిచాకిరీ ఘటనలపై సమాచారం అందించేందుకు ప్రభుత్వం టోల్‌ఫ్రీ బాండెడ్ లేబర్ హెల్ప్‌లైన్‌ను అందుబాటులో ఉంచిందని తెలిపారు. బాధితులు, సమాచారం తెలిసినవారు 08069434343 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. స్వేచ్ఛా రథం ద్వారా గ్రామగ్రామాన ప్రజలకు వెట్టిచాకిరీ వల్ల కలిగే అనర్థాలు, కార్మికుల హక్కులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించనున్నారు. బలవంతపు శ్రమకు గురవుతున్న వారిని గుర్తించి అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వ శాఖలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవనం, స్వేచ్ఛగా పనిచేసే అవకాశం కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- పోలీస్ అధికారులకు సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు



పెద్దపల్లి మహా : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పోలీస్ అధికారులతో నిర్వహించిన సెప్టెంబర్ నెల నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల దర్యాప్తు, నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్ల దాఖలుపై సమీక్షించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు.గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, గుడుంబా తయారీ, అక్రమ ఇసుక రవాణా, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిఘా పెంచాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మహిళలు, బాలలపై నేరాలు, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని పేర్కొన్నారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండపాల వివరాలు సేకరించి, సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసులను మోహరించాలని సూచించారు. సమావేశంలో పెద్దపల్లి, మంచిర్యాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నివారణకు సాంకేతిక నైపుణ్యాలను వినియోగించాలి




**పెద్దపల్లి మహా:** పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ఉద్యోగులు, అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, హెడ్ ఆఫ్ ప్రాజెక్ట్ ఫియాజ్ టైయబ్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు అధిక వేతనాలు, ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో యువతను ప్రలోభపెట్టి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ధృవీకరించుకోకుండా ఎవరికీ డబ్బులు పంపవద్దని సూచించారు. సైబర్ మోసాల నుంచి రక్షణ పొందేందుకు "ఆగండి.. ఆలోచించండి.. నిర్ధారించుకోండి అనే సూత్రాన్ని పాటించాలని పిలుపునిచ్చారు.యువ ఇంజనీర్లు తమ సాంకేతిక నైపుణ్యాలను సైబర్ నేరాల నివారణకు వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించే వీడియోలను ప్రదర్శించారు. పోలీస్ అధికారులు, ఎన్టీపీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- సర్వే ప్రక్రియలో రైతుల సహకారం అవసరం
- తానూరు రీ సర్వే పరిశీలించిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ మహా : భూముల రీ సర్వే ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం తానూరులో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను సర్వే పురోగతి, చేపడుతున్న చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.రీ సర్వే నిర్వహించే ముందు సంబంధిత రైతులందరికీ ముందస్తుగా సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహిస్తూ, ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సర్వే బృందంలోని సిబ్బంది అందరూ విధిగా పాల్గొని, నిర్దేశించిన గడువులోగా రీ సర్వేను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్, భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూముల సర్వే, రీ సర్వే ప్రక్రియను చేపడుతోందని తెలిపారు. సర్వే సమయంలో సంబంధిత భూముల రైతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు రైతులు అధికారులకు సహకరించాలని కోరారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ మహేంద్రనాథ్, సర్వేయర్ కిషన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మంథనిలో అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

**కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి మహా: మంథని ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

గోదావరి పుష్కర ఘాట్ వద్ద రహదారి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నాలుగు రోజుల్లో డిజైన్లు ఖరారు చేసి, పది రోజుల్లోగా కాంక్రీట్ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని నాలుగు లేన్ల రహదారి నిర్మాణాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. హెలిప్యాడ్‌కు అవసరమైన మరమ్మతులు చేయాలని తెలిపారు.

రామగిరి మండలం పన్నూరు క్రాస్‌రోడ్ వద్ద డబుల్ రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంథనిలో నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను గడువులోగా పూర్తిచేసి, అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు.

నిర్మాణంలో ఉన్న సమీకృత డివిజన్ కార్యాలయ భవనాన్ని మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయ భవనంలో మిగిలిన పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఆర్‌అండ్‌బీ ఈఈ భావ్ సింగ్, ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



## అమరజీవి కామ్రేడ్ గుండా మల్లేష్ కు విప్లవ జోహార్లు..

- మందమర్రి ఏఐటీయూసీ కార్యాలయంలో ఘన నివాళులు

**మందమర్రి, మహా** : పీడిత ప్రజల పక్షపాతి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అమరజీవి కామ్రేడ్ గుండా మల్లేష్ సేవలు మరువలేనివని, ఆయన చివరి శ్వాస వరకు పేదలు, కార్మికులు, కర్షకుల శ్రేయస్సు కోసమే పాటుపడ్డారని సీపీఐ మండల కార్యదర్శి వనం సత్యనారాయణ, మందమర్రి పట్టణ కార్యదర్శి కామెర దుర్గారాజ్ లు కొనియాడారు. కామ్రేడ్ గుండా మల్లేష్ 6వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మందమర్రి పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలంటే మల్లేష్ అన్నకు ఎంతో గౌరవమని, వారి హక్కుల సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప ప్రజా నాయకుడని అన్నారు. ఎర్రజెండా ఆశయాల కోసం, శ్రమజీవుల విముక్తి కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంతేకాకుండా కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం, పేద ప్రజలకు న్యాయం జరిగే వరకు నిరంతరం పోరాడటమే కామ్రేడ్ గుండా మల్లేష్ కు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. నేటి సమాజంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలపై వామపక్ష శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఆర్. వెంకన్న, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంటోనీ దినేష్, ఎండి. రసూల్, జక్కన బోయిన సమేందర్, హమాలీ సంఘం నాయకులు డి. సంపత్, సాగే పోశం, పూరెల్ల శ్రీనివాస్, ఆవుల కుమార్, పూరెల్ల మహేష్, దామరకుంట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




## బాధిత రైతుల వినూత్న నిరసన

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : నేషనల్ హైవే 63 బాధిత రైతులు సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ ప్రతులను చేతబట్టి పాలక కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ సీనియర్ నాయకులు తూలా మధుసూదన్ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి అలైన్మెంట్ లో బ్రౌన్ ఫీల్డ్ ను గ్రీన్ ఫీల్డ్ గా మార్చి రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. బడా పెట్టుబడిదారులు, కొందరు దళారుల ప్రయోజనాల కోసం నేషనల్ హైవే అథారిటీ అధికారులను తప్పుదారి పట్టించారని, ఇందులో రాష్ట్ర మంత్రి వివేకానంద ప్రధాన పాత్ర పోషించారని ఆరోపించారు. రాహుల్ గాంధీతో సహ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద రాజ్యాంగ పరిరక్షణ అంటూ ఆందోళన చేస్తున్నారని, కానీ మంచిర్యాలలో రైతులకు జరుగుతున్న అన్యాయం వారికి కనిపించడం లేదా అని విమర్శించారు. తాము ఢిల్లీ వెళ్లి ఎన్. హెచ్.ఏ.ఐ. అధికారులను కలిసినప్పుడు తప్పు జరిగిందని వారు గుర్తించారని, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు సిఫార్సు చేస్తే తిరిగి బ్రౌన్ ఫీల్డ్ గా మారుస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ రైతుల పక్షాన నిలబడి కేంద్ర మంత్రి గడ్కరీకి లేఖ రాయడం లేదని, మంత్రి చేసిన తప్పును కప్పిపుచ్చేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇదే రాజ్యాంగ ప్రతులతో ఢిల్లీ జంతర్ మంతర్ లో రాహుల్ గాంధీని ప్రశ్నిస్తామని హెచ్చరించారు. రైతు నాయకుడు లగిశెట్టి రాజమౌళి మాట్లాడుతూ, తమను మోసం చేసిన నాయకులను వదిలేది లేదని, తమకు సహకరిస్తున్న నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తున్న దళారుల పేర్లను త్వరలో బయటపెడతామని హెచ్చరించారు. ఎంపీ వంశీ వలసవాదులకు కాకుండా ఓట్లేసి గెలిపించిన రైతులకు అండగా నిలబడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్రె లచ్చన్న, గంధం శ్రీనివాస్, సురేందర్ చారి, రైతు నాయకులు చెల్లా వెంకటేష్, కస్తూరి మల్లేష్, బొలిశెట్టి తిరుపతి, పరమేష్, మాజీ ఎంపీటీసీ తిరుపతి, దాస్య నాయక్, శంకర్, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## చీపురు, పార పట్టిన మందమర్రి ఏరియా జీఎం

**మందమర్రి, మహా :** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చాటుతూ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ స్వయంగా చీపురు, పార పట్టుకొని ఉద్యోగులకు ఆదర్శ పాత్ర పోషించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం 6 లో భాగంగా సోమవారం మందమర్రి ఏరియాలోని కేకే2 బంగ్లా ప్రాంగణంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఎండిన ఆకులను స్వయంగా తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భావి తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించడం మనందరి బాధ్యతని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, ఈవేస్ట్ ను శాస్త్రీయంగా తొలగించాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 31 నాటికి మందమర్రి ఏరియాలోని అన్ని గనులు, కార్యాలయాలు, నివాస ప్రాంతాలను ఈకో ఫ్రెండ్లీగా తీర్చిదిద్దాలని, పాత రికార్డులు, స్క్రాప్ తొలగింపు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి, డీజీఎం కిరణ్ కుమార్, ఏఎస్ఓ మురళి, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకట్ రెడ్డి, ఫారెస్ట్ అధికారి నవీన్, డీజీఎం సివిల్ మదీనా భాషా, పర్చేస్ అధికారి బాబు, ఐటీ మేనేజర్ రవి, సీనియర్ పీఓ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసు దర్యాప్తులో పోలీసులకు షాక్

- రాళ్లు, కర్రలతో దాడి-పోలీసు వాహనం ధ్వంసం
- ఐదుగురు పోలీసులకు గాయాలు
- 20 మంది నిందితుల అరెస్ట్
- విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్న ఎస్పీ




**ఆదిలాబాద్ మహా :** విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేసి, వారిని నిర్బంధించి, ప్రభుత్వ పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన ఘటనలో మొత్తం 20 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.మంగళవారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. సోమవారం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మంగళవారం మరో 13 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాయిపేట్ లో అక్టోబర్ 10న గంజాయి కేసు దర్యాప్తులో భాగంగా పోలీసు సిబ్బంది నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో కొందరు వ్యక్తులు గుంపుగా ఏర్పడి పోలీసులపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. పోలీసు వాహనంపై రాళ్లు రువ్వడంతో పాటు, పోలీసు సిబ్బందిపై కర్రలతో దాడి చేసి గాయపరిచినట్లు, వారిని బలవంతంగా సర్పంచ్ ఇంటికి తీసుకెళ్లి నిర్బంధించినట్లు తెలిపారు. పోలీసులను చంపుతామని బెదిరించడం, ప్రభుత్వ పోలీసు వాహనాన్ని ధ్వంసం చేయడం, ప్రభుత్వ ఫోన్‌ను ధ్వంసం చేయడంతో పాటు మరో సెల్‌ఫోన్, కేసుకు సంబంధించిన సీడీ ఫైల్‌ను అపహరించినట్లు తెలిపారు.ఈ ఘటనలో పోలీస్ సిబ్బంది కి తీవ్ర గాయాలైనట్టు తెలిపారు. దాడిలో ఇతరుల పాత్ర పై దర్యాప్తు కొనసాగుతుందని, దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పోలీసు సిబ్బంది చట్టబద్ధంగా విధులు నిర్వహిస్తున్న సమయంలో వారిపై దాడి చేయడం, విధులకు ఆటంకం కలిగించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని పోలీసులపై దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని, నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి రుత్విక్ సాయి తదితరులు పాల్గొన్నారు.



## దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**బెల్లంపల్లి,మహా**: బెల్లంపల్లి 1 వార్డు కన్నాలబస్తీలో శరన్నవరాత్రుల సందర్భంగా నవదుర్గ ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు దుర్గామాతకు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పెంచాల రమేష్, కార్తీక్, సాయికిరణ్, రాజేంద్ర ప్రసాద్ కొయ్యడ సంజయ్ తదితరులు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు ఘన స్వాగతం పలికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొని లోక కల్యాణం కోసం అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ అన్నప్రసాద వితరణలో ఆయన స్వయంగా పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, ఏలూరి వెంకటేష్,శ్రావణ్ ఈట రాకేష్, ఖలీం, సుందర్ రావు ,దాగం చరణ్,తో పాటు స్థానిక బీఆర్ఎస్ కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గంజాయి రహిత జిల్లా లక్ష్యం

- అధికారులతో కలెక్టర్ ఎస్పీ సమీక్ష
- సమన్వయంతో పనిచేయాలి
- గంజాయి ని అంతం చేయాలి



**ఆదిలాబాద్ మహా** : యువత భవిష్యత్తుకు పెను ముప్పుగా విస్తరిస్తున్న గంజాయి సాగు, విక్రయాలు, అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గంజాయి రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు, సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి భూతాన్ని అంతం చేసేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, అటవీ, వ్యవసాయ శాఖలు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో నిరంతర నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలు, సరిహద్దు తనిఖీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందితే తక్షణమే స్పందించాలని ఆదేశించారు.
జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, గంజాయి కట్టడి విషయంలో పోలీస్ శాఖ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గంజాయి విక్రయదారులు, సరఫరాదారుల పూర్తి వివరాలు సేకరించి పీడీ యాక్ట్‌తో సహా కఠిన కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులు, యువత ఈ వ్యసనాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. గంజాయి సాగుకు దూరంగా ఉండేలా రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రజలు నిర్భయంగా సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసానిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిహెచ్ఎంహెచ్ఓ సాధన, రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఆహార భద్రత అధికారిణి బి.ప్రత్యూష, పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది వేడుకల్లో పాల్గొన్న డా. చిరుమిల్ల రాకేష్ కుమార్

**పెద్దపల్లి మహా :** తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన దశాబ్ది వేడుకల్లో టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమిల్ల రాకేష్ కుమార్ పాల్గొన్నారు. తొలుత అయ్యప్ప టెంపుల్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, బస్టాండ్ కూడలిలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ దాసరి మమత, ప్రశాంత్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు గంట రాములు, వంగల తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, దాసరి ఉషతో పాటు కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పేద ప్రజల సమస్యలపై అలుపెరుగని యోధుడు గుండా మల్లేష్

- సిపిఐ శ్రేణుల ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ఘనంగా గుండా మల్లేష్ వర్ధంతి వేడుకలు

**బెల్లంపల్లి ,మహా,**: పేద ప్రజల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన యోధుడు కీ.శే. కామ్రేడ్ గుండా మల్లేష్ సేవలు చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్ పేర్కొన్నారు.
అమరజీవి దివంగత నేత కామ్రేడ్ గుండా మల్లేష్‌గారి 6 వ వర్ధంతి కార్యక్రమం భారత కమ్యూనిస్టు పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గం ఆధ్వర్యంలో పట్టణంలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద గల గుండ మల్లేష్ విగ్రహానికి పూలమాలవేసి, పట్టణ సిపిఐ కార్యాలయంలో గుండా మల్లేష్ చిత్రపటానికి పూలమాలవేసి పట్టణ కార్యదర్శి ఆడెపురాజమౌళి అధ్యక్షతన వర్ధంతి సభను మంగళవారం రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్, మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ , రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి హాజరై వారు మాట్లాడుతూ అమరజీవి గుండ మల్లేష్ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పేద ప్రజల సమస్యలపై అలుపెరుగని ప్రజా ఉద్యమాలు నిర్మించి, దున్నేవానికి భూమి చెందాలని భూమిలేని పేదలకు భూమి ఇవ్వాలని, లాకప్ డెత్ లకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిన మహోన్నతమైన నేత. సామాన్య కుటుంబంలో పుట్టి భారత కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతానికి ఆకర్షితులై కామ్రేడ్ బాసెట్టి గంగారం, కామ్రేడ్ పోతుగంటి పోశెట్టి లకు ప్రియశిష్యుడై సింగరేణి ఉద్యోగాన్ని వదిలేసి కమ్యూనిస్టు పార్టీలో చేరి అంచలంచలుగా ఎదిగి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నికై ఆసిఫాబాద్ నియోజక వర్గానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా నూతనంగా ఏర్పడిన బెల్లంపల్లి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా మొత్తం నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసి ప్రజాసేవకు అంకితమయ్యాడని,నియోజకవర్గంలో అనేక ప్రజా సమస్యలను పరిష్కరించి, ఎన్నో ప్రభుత్వ భవనాలను, బెల్లంపల్లి పట్టణానికి బస్టాండ్ను నిర్మింపజేసి, ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ఎన్నో ప్రాజెక్టుల గురించి, తుమ్మడి హెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలని, జిల్లాలోని భూములను సస్యశ్యామలం చేయాలని శాసనసభలో గళమెత్తిని నేత,ఎటువంటి అవినీతి మచ్చ లేకుండా నిస్వార్థ జీవితాన్ని గడిపిన మహోన్నతమైన నేత. తన జీవితాన్ని అంతా మరణించేవరకు ప్రజాసేవకే అంకితం చేసిన త్యాగజీవి అని ఆయన సేవలను కొనియాడారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకుపోవడానికి మనమంతా కృషి చేయాలని అదే ఆయనకు నిజమైన నివాళులని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో గుండా మల్లేష్ సతీమణి గుండ సరోజన, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బొల్లంపూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ , మహిళా సమైక్య జిల్లా అధ్యక్షులు బొల్లం సోని,బి కే ఎం యు జిల్లా కార్యదర్శి గుండ చంద్రమణిక్యం, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మేకల రాజేశం, జిల్లా సమితి సభ్యులు డిఆర్ శ్రీధర్, రత్నం రాజ్యం, పార్టీ నాయకులు స్వామి దాసు, కామర దుర్గయ్య,కే తిరుపతి, జి మహేందర్ రెడ్డి, స్వర్ణలత, చంద్రయ్య, మిట్టపల్లి మల్లేష్, శంకర్, ప్రశాంతి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా సాయి భోజన్

- గర్భిణులకు, బాలింతలకు, డయాలసిస్ పేషెంట్లకు అన్నదానం
- బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమం
- బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ

**బెల్లంపల్లి,మహా**: దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా బెలంపలి ప్రభుత ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కనుకుంట్ల ప్రశాంత్ శ్రీలేఖ, కనుకుంట్ల శ్రీనివాస్ సరోజన, ఆడెపు సదానందం దేవేంద్ర ల కుటుంబీకుల ఆర్థికసహకారంతో గర్భిణులకు, బాలింతలకు, డయాలసిస్ రోగులకు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్‌రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని గర్భిణీలు, బాలింతలు, రోగులు, అన్నార్తులు, ఆసుపత్రి సిబ్బంది, సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి మరియు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.అన్నదానం చేద్దాం ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం అన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్‌రాజేశ్వరి పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని, మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ అన్నారు. ఈ సేవా కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు, రాజేశ్వరి జేరిపోతుల చంద్రకళ, సేవకులు పోతురాజుల తిరుపతి, కనుకుంట్ల సరోజన శ్రీనివాస్ వరాల క్రాంతి భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు..



## హోటల్ యజమాని అరికిల్ల దుర్గయ్య మృతికి కాంగ్రెస్ నేతల సంతాపం

- కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకుల సంతాపం

**బెల్లంపల్లి, మహా**,:బెల్లంపల్లి పట్టణానికి చెందిన భవన్ హోటల్ యజమాని,బెల్లంపల్లి హోటల్ యూనియన్ మాజీ అధ్యక్షులు అరికిల్ల దుర్గయ్య అనారోగ్యంతో మరణించడం పట్ల పట్టణ కాంగ్రెస్ నేతలు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావా స్వాతి రమేష్ బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపం తెలిపారు.
ఈ సందర్భంగా కాంట్రాక్టర్ బస్తీలోని దుర్గయ్య స్వగృహానికి చేరుకున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్ , మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు లు ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.దుర్గయ్య మరణం బెల్లంపల్లి పట్టణానికి తీరని లోటు. హోటల్ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఆయన మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, దుఃఖాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని పట్టణకాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టి పి సి సి మెంబర్ చిలుముల శంకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గెల్లి రాజలింగు,మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు పూర్ణ చందర్ (బాబు రావు),వజీయర్, అధికార ప్రతినిధి దేవసాని ఆనంద్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు దెబ్బేటి రమేష్, వాజిద్ బాయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పోచంపల్లి హరీష్, నాయకులు రేగుంట రాజలింగూ, కుడిక్యాల శంకర్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని అరికిల్ల దుర్గయ్య భౌతికకాయానికి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కలెక్టరేట్ లో నేడు బతుకమ్మ సంబరాలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్,కలెక్టరేట్ మహా ;** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ అధికారులు, మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. అక్టోబరు 14న సాయంత్రం 5 గంటలకు బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా మహిళా ఉద్యోగులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉద్యోగులందరికీ పాటల పోటీలు, అంత్యాక్షరి, స్టాండప్ కామెడీ పోటీలు జరగనున్నాయి. అంతేకాకుండా వివిధ శాఖల మధ్య ఉత్తమ బతుకమ్మ, ఉత్తమ వేషధారణ, ఉత్తమ బిందీ పోటీలను నిర్వహించనున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.

## ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలపై లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం!

**రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు**



ఢిల్లీ అక్టోబర్ 13 మహా: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఢిల్లీ పోలీసుల లాఠీచార్జ్‌లో గాయపడిన, తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాం రెడ్డికి గాయాలు కావడం బాధాకరమని, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై లాఠీచార్జ్ చేయడం ఆందోళనకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



## ఉత్సవ రథం పనులను పరిశీలించిన హనుమకొండ కలెక్టర్

**రంగంపేట, మహా** : శ్రీ భద్రకాళి దేవాలయంలో రథోత్సవం నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రూపుదిద్దుకుంటున్న ఉత్సవ రథం పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. రథోత్సవ ఏర్పాట్ల వివరాలను ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ఆలయ కార్య నిర్వహణాధికారి సునీత ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆలయ మాడవీధుల్లో ఉత్సవ రథం సజావుగా తిరిగేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భద్రకాళి చెరువులో తగినంత నీటి వసతి లేనందున తెప్పోత్సవానికి తాత్కాలికంగా నీటి కొలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ రాం ప్రసాద్, అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భద్రకాళి తాగునీటి జలాశయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సాగునీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. భద్రకాళి తాగునీటి జలాశయానికి దేవాదుల నీరు చేరేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇరిగేషన్ డీఈ మధుసూదన్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అద్దె కార్లతో రూ.14.50 లక్షల మోసం

**ఐదు కార్లు స్వాధీనం.. నిందితుడి అరెస్ట్**

కుషాయిగూడ, మహా: అద్దెకు తీసుకున్న ఐదు కార్లను తిరిగి ఇవ్వకుండా, నకిలీ పత్రాలతో బదిలీ చేసి రూ.14.50 లక్షలు మోసానికి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడు వడ్డె మహేష్‌ను కీసర పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి ఐదు కార్లు, మొబైల్ ఫోన్, అసలు ఫామ్ నంబర్ 35ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కీసర పోలీసులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. జవహర్‌నగర్ ఏసీపీ ఎస్. చక్రపాణి మార్గదర్శకత్వంలో కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

# వరంగల్ బస్ స్టేషన్ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలి

- కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి
- నిర్మాణ పనులను పరిశీలించిన కుడా చైర్ పర్సన్, హనుమకొండ జిల్లా కలెక్టర్



**వరంగల్, బ్యూరో మహా** : వరంగల్ బస్ స్టేషన్ నిర్మాణ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి అన్నారు.వరంగల్ లో నిర్మాణంలో ఉన్న బస్ స్టేషన్ పనులను, వాటి పురోగతిని హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయితో కలిసి కుడా చైర్ పర్సన్ పరిశీలించారు. బస్ స్టేషన్ నిర్మాణ, అభివృద్ధి పనులకు సంబంధించిన మ్యాపును పరిశీలించారు. పనుల పురోగతిని గురించి నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ వరంగల్ బస్ స్టేషన్ త్వరగా పూర్తయ్యే విధంగా నిర్మాణ పనులు సాగాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వరంగల్ బస్ స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతం చేయడంలో భాగంగా అదనంగా మరింత మంది వర్కర్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. కాలమ్స్, స్లాబ్స్ రిటెయినింగ్ వాల్ పనులను ఏకకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుడా ఈఈ భీమ్ రావు, డీఈ జలాలుద్దీన్, ఇతర అధికారులతో పాటు సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈహెచ్ ఎస్ అమలుకు థానా అంగీకారం

హనుమకొండ, మహా ; హనుమకొండ జిల్లాలో గుర్తించిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకం ఈ హెచ్ ఎస్ అమలు చేసేందుకు థానా కమిటీ సభ్యులు అంగీకరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, ఐఏఎస్ సమక్షంలో ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని, గుర్తించిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈహెచ్ ఎస్ పథకాన్ని అమలు చేసేందుకు సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాలు సహకరించాలని సూచించారు. ఈ పథకం ద్వారా అర్హులైన ఉద్యోగులు మెరుగైన వైద్య సేవలు పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, హనుమకొండ జిల్లాలో గుర్తించిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈహెచ్ ఎస్ పథకం అమలుకు థానా కమిటీ సభ్యులు అంగీకరించడం సంతోషకరమని తెలిపారు. పథకం అమలుకు సంబంధించి అవసరమైన నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ ఉద్యోగులకు వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో థానా కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాకేష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమేష్ సభ్యులు డాక్టర్ విజయ్‌చందర్ రెడ్డి, డాక్టర్ విజయ్, డాక్టర్ బి మోహన్ రావు, అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కింగ్ లేని వైన్స్ లకు అనుమతులు ఎలా? జనం నరకయాతన

- రంజిత్,విశాల్ వైన్స్ లకు పార్కింగ్ సదుపాయం ఎక్కడ?
- పార్కింగ్ ప్లేస్ లు గా మారిన ప్రధాన రోడ్లు
- ముడుపుల మత్తులో పట్టించుకోని ట్రాఫిక్, ఎక్సైజ్ అధికారులు



**హనుమకొండ, మహా** : హనుమకొండ లోని కేయూ సీ ప్రధాన రోడ్డు డబ్బాల పరిధిలో ఉన్న హనుమాన్ నగర్ లో రిలయన్స్ ఫ్రెష్ పక్కన ఉన్న రంజిత్ వైన్స్ ముందు ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు పాదచారులు చెబుతున్నారు. గతంలో ఈ వైన్స్ రోడ్డుకు అవతల ఉండేదని అప్పుడు కూడా ట్రాఫిక్ జామ్ తో అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి అని దీంతో స్థానిక ప్రజలు, ఆ కాలనీలోని కుటుంబాలు నిరాకరించడంతో మరల వైన్స్ కు అనుమతి ఇవ్వలేదని స్థానికులు చెబుతున్నారు. మరలా ఇప్పుడు అదే పరిస్థితి నెలకొందని ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాధుడే లేడని స్థానికులు మండిపడుతున్నారు. పార్కింగ్ సదుపాయం లేకుండా సంబంధిత అధికారులు వైన్స్ కు అనుమతి ఎలా మంజూరు చేశారని వారు ప్రశ్నిస్తున్నారు. పార్కింగ్ స్థలం లేకపోవడంతో ప్రధాన రహదారే పార్కింగ్ స్థలంగా మారింది. రోజూ వందలాది వాహనాలు రోడ్డుపైనే నిలపడం తో వాహనదారులు, పాదచారులు, స్థానిక మహిళలు రోడ్డు పై నడవాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ ట్రాఫిక్, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు బహిరంగంగా వ్యక్తమవుతున్నాయి. సాయంత్రం అయితే ఈ ప్రధాన రహదారిలో ఉన్న రంజిత్ వైన్స్ ముందు ఇప్పుడు ట్రాఫిక్ జామ్ కు ప్రధాన కేంద్రంగా మారింది. నిబంధనల ప్రకారం ఏ వైన్స్ షాప్‌కైనా తప్పనిసరిగా పార్కింగ్ స్థలం ఉండాలి. కానీ నగరంలో కొన్ని మద్యం షాపులు ప్రధాన రహదారిని పార్కింగ్ స్థలాలుగా మార్చుకుంటున్నారు. దీంతో మద్యం కొనేందుకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్ల పైనే విచ్చలవిడిగా పార్కింగ్ చేస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.

**విశాల్ వైన్స్ ముందు పరిస్థితి**

అసలే నగరంలో ఇరుకైన రోడ్లు అందులో మరమ్మత్తులతో సగం రోడ్లు నాశనమయ్యాయి. దీంతో తరుచూ ట్రాఫిక్ జామ్ ల తో పాదచారులు ఫుట్ పాత్ లేక రోడ్డు పై నడవలేక పోతున్నారు. ఈ క్రమంలోనే ప్రధాన రోడ్ల మీద వాహనాలు పార్కింగ్ చేస్తూ సగం రోడ్డును ఆక్రమిస్తున్నారు. వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్ నుంచి దేశాయ్ పేట రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారి పై గల విశాల్ వైన్స్ ముందు పరిస్థితి కూడా అంతే..

**రోడ్డు పై మద్యం ప్రియులు దాదాపు**

ఒకేసారి గా 10 నుండి 20 వాహనాలు రోడ్డు పై నిలపడంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా స్థానిక మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, కార్లు వెళ్లాలంటే ట్రాఫిక్ జామ్ లో చిక్కుకుంటున్నాయి. పాదచారులు నడవడానికి కూడా స్థలం లేకుండా పోయింది. సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు వాహనాల పార్కింగ్ లతో నరకయాతన చెప్ప లేకుండా ఉందని పర్మిట్ రూముల పేరుతో రోడ్లపై మద్యం తాగుతూ మందు బాబులు వీరంగం సృష్టిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అసలు పార్కింగ్ లేని ఈ వైన్స్ లకు ఎక్సైజ్ శాఖ ఎలా అనుమతులు ఇచ్చింది? ట్రాఫిక్ పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. నెలనెలా ముడుపులు అందుతుండటంతోనే అధికారులు కళ్లు మూసుకున్నారని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్, స్థానిక పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడం లో ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితుల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ప్రధాన రహదారిని ఆక్రమించి వ్యాపారం చేస్తున్న ఈ వైన్స్ లపై వెంటనే చర్యలు తీసుకోవాలని, పార్కింగ్ లేని వైన్స్ ల లైసెన్స్ లను రద్దు చేయాలని, లేదంటే పార్కింగ్ స్థలం చూపించే వరకు షాపులను సీజ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్లు, సీపీ, ఎక్సైజ్ జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## శాంతి భద్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

- ఇన్స్పెక్టర్ ఏ. మహేందర్

హసన్పర్తి, మహా : హసన్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవన్నపేట గ్రామంలో జరిగిన గొడవకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే.. దేవన్నపేట గ్రామానికి చెందిన రంగారపు కిరణ్ వయస్సు 38 సం., కులం: మాదిగ , వృత్తిరీత్యా పెయింటింగ్ చేస్తూ జీవిస్తున్నారు. ఆయన ఇంటికి ఎదురుగా ఉండే సందెల సరోజన తన ఇంట్లో బెల్టుషాప్ నిర్వహిస్తుండగా, కిరణ్ గతంలో అక్కడ మద్యం ఉద్దెర తీసుకునేవాడు. పని డబ్బులు రాగానే ఆ డబ్బులను చెల్లిస్తుండేవాడు. అయితే, అక్టోబర్ 12, 2026 న ఉదయం నుండి సరోజన బూతులు తిడుతుండగా, సాయంత్రం 4:00 గంటల సమయంలో కిరణ్ పెయింటింగ్ పనికి వెళ్తుండగా తనను ఉద్దేశించి బూతులు మాట్లాడుతుండటంతో ఎవరిని తిడుతున్నారని కిరణ్ ప్రశ్నించారు. ఆ తర్వాత సాయంత్రం 4 30 గంటలకు సరోజన కొడుకు సందెల మోహన్, కిరణ్ కు ఫోన్ చేసి బూతులు తిడుతూ బెదిరింపులకు పాల్పడ్డాడు. సాయంత్రం 4 40 గంటలకు కిరణ్ ఇంటికి రాగా, అక్కడ సందెల సరోజన, ఆమె కొడుకు మోహన్ మరియు మోహన్ కొడుకు సందెల రక్షిత్ కలిసి కిరణ్ పై బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారు. ఇంట్లోకి వెళ్లిన కిరణ్ పైకి వెళ్లి కర్రతో ముఖం పై, ఎడమ చేతిపై కొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. ఆ సమయంలో అక్కడికి వచ్చిన బంధువులు గంగాధరి బాబు, గుర్రపు బబ్లు, భార్య రేణుకలు వారిని అడ్డుకున్నారు. నిందితులు కిరణ్ ను ఎప్పటికైనా చంపుతామని బెదిరించి వెళ్లిపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హసన్పర్తి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. మహేందర్ వెల్లడించారు.



## అభ్యర్థుల సర్టిఫికెట్లను పారదర్శకంగా పరిశీలించాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ, మహా** : హనుమకొండ జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ల భర్తీ కోసం ఇటీవల వెలువడిన ప్రకటన ఆధారంగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న మహిళా అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన మంగళవారం హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ లో గుండ్ల సింగారం 3 కి సంబంధించిన అభ్యర్థుల సర్టిఫికెట్స్ ను అధికారులు పరిశీలిస్తుండగా ఆ ప్రక్రియను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. కేఎల్ఎన్ రెడ్డి కాలనీ లో ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ను సందర్శించి దరఖాస్తు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలనలో అధికారులు పారదర్శకత, నిబంధనల ప్రకారం అర్హత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో, జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ మాట్లాడుతూ.. 19 పోస్టులకు గాను 953దరఖాస్తులు వచ్చాయని నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితుల పై కలెక్టర్ ఫోకస్

- గ్రామాల వారీగా పంటల పరిస్థితి పై అంచనా వేయాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**కలెక్టరేట్, మహా** : ఎల్ నినో పరిస్థితుల పై జిల్లా కలెక్టర్ ఫోకస్ పెట్టారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నందున వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లో మంగళ వారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరు తడి పంటలు పండించేలా రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామాల వారీగా పంటల పరిస్థితి, నీటి లభ్యతను అంచనా వేయాలని సూచించారు. పంటలు ఎండిపోయే పరిస్థితులున్న గ్రామాలు, నీటి కొరత ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో గుర్తించి నివేదికలు సమర్పించాలన్నారు. వర్షపాతం, భూగర్భ జలాలు, సాగునీటి వనరుల లభ్యతపై సమగ్ర సమాచారం సేకరించి నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. రానున్న వ్యవసాయ సీజన్‌లో నీటి ఎద్దడి ఏర్పడకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వాతావరణ అంచనాలను నిరంతరం పరిశీలిస్తూ పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన సూచనలు అందించి పంట నష్టాన్ని నివారించేందుకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యాన వన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, డీఆర్డీవో నాగ పద్మజ, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలాజీ, సిపిఓ చంద్రకళ, ఆర్ డబ్యు ఎస్ అధికారి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో దాడి చేసిన నిందితులు అరెస్టు

**హసన్పర్తి, మహా:** హసన్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో దాడి చేసి, భయానక వాతావరణం సృష్టించిన ఘటన పై కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. మహేందర్ తెలిపారు.సంఘటనా వివరాలు తేదీ 13 10 2026 సాయంత్రం 5:30 గంటల సమయంలో, తాళ్ల నేపాల్ @ సంతోష్ , సదానందం, పప్పుల హరిప్రసాద్, పోతరాజు సుజిత్, మట్టేడ శ్రీకాంత్ తో పాటు మరో వ్యక్తి కలిసి వారాల స్మశాన వాటిక వద్ద మద్యం సేవించారు. అనంతరం వారు స్థానికంగా ఉన్న సూరయ్య ఇంట్లోకి చొరబడి, ఇంటి ముందున్న నీటి సంపు వద్ద అసభ్యకరంగా ప్రవర్తించారు. ఇంట్లో ఉన్న కోడలు హారిక భయంతో కేకలు వేయగా, అక్కడే ఆవులను మేపుతున్న పావుశెట్టి వేణుమాధవ్ (65) వారిని నిలదీశారు. ఆగ్రహించిన నిందితులు వేణుమాధవ్ ఆయనను కాపాడటానికి వచ్చిన రత్నాకర్ పై విచక్షణారహితంగా దాడి చేసి, బూతులు తిట్టారు. అడ్డుకున్న కనపర్తి కిరణ్ వారిని విడిపించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హసన్పర్తి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. మహేందర్ వెల్లడించారు.




## ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- స్టేట్ ఎన్ హెచ్ ఎం జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఈ భరత్ కుమార్ డిమాండ్

**పోచమ్మ మైదాన్, మహా** : వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ జంక్షన్ లో జిల్లా ఎన్ హెచ్ యం ఉద్యోగులు మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 17వేల మంది ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్డెక్కారు. సమ్మె కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి భరత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలతో పాటు సేవ ప్రయోజనాలు వంటి సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తుందని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగులందరిని కాంటినెంట్ ఉద్యోగుల నుండి డాక్టర్ వరకు నిబంధనల ప్రకారం ఎటువంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్ హెచ్ ఎం 78 క్యాడర్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత పిఆర్సి న్యాయమైన వేతనాలు గ్రాస్ శాలరీ వార్షిక ఇంక్రిమెంట్లు రాయల్టీ బోనస్ ఉద్యోగులకు ఆరోగ్య భీమా ఇతర సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలని వివిధ క్యాడర్ల మధ్య వేతన వ్యత్యాసాలను న్యాయబద్ధంగా సమీక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల వేదనను ప్రభుత్వ అర్థం చేసుకొని వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సానుకూల చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమ్మెలో డాక్టర్ రవీందర్ నితిన్ రెడ్డి డాక్టర్ హరికృష్ణ డాక్టర్ మోహన్ రావు డాక్టర్ మధు డాక్టర్ యశస్విని డాక్టర్ రమ్య డైట్ మేనేజర్ అనిల్ వీసీ సీఎం రవీందర్ డి ఏ ఓ సునీత సంఘా అనిల్ కుమార్ అంజి నర్మద జ్యోతి గీత వైకుంఠం ఎల్ ఎస్ ఎం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## కోటమైసమ్మ జాతర ప్రాంతాన్నిపరిశీలించిన సీఐ

- ఈనెల 20 నుంచి జాతర
- ట్రాఫిక్, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి - సీఐ ఎన్.సాగర్, ఎస్సైబి.గోపి

**కారేపల్లి, మహా** : సింగరేణి ప్రాంతంలో అతి పెద్ద జాతర కోటమైసమ్మ జాతర ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కోటమైసమ్మ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సింగరేణి సీఐ నూనావత్ సాగర్, ఎస్సై బైరు గోపి లు జాతర జరిగే శ్రీ కోటమైసమ్మ తల్లి ఆలయ పరిసరాలను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ కు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వారు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో కే.వెంకటయ్య లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో జాతర విజయవంతానికి కృషి చేస్తున్నట్లుతెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు పగడాల మోహన్ కృష్ణ, పర్సా లలిత్ సాయి, ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాష్ శర్మ, భైరవభట్ల సాయిరాం శర్మ తదితరులు పాల్గొన్నారు.



## కొమ్ముగూడెంలో తెలంగాణ రక్షణసేన మేనిఫెస్టోపై ప్రచారం

దమ్మపేట ,మహా : మండల పరిదిలోని కొమ్ముగూడెం గ్రామంలో తెలంగాణ రక్షణసేన మేనిఫెస్టోపై నియోజకవర్గ ఇన్‌చార్జ్ సోడెం వెంకట్ ఆధ్వర్యంలో గడప గడపకు ప్రచారం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సోడెం వెంకట్ ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం వంటి అంశాలతో పాటు మేనిఫెస్టోలోని భూలక్ష్మి పథకం గురించి ప్రజలకు వివరించారు. భూలక్ష్మి పథకం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలు, అలాగే మేనిఫెస్టోలోని పంచజన్య పథకాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటూ, వాటికి అనుగుణంగా మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. ప్రతి కుటుంబానికి మేనిఫెస్టోలోని అంశాలు చేరేలా గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నామని సోడెం వెంకట్ తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.



## బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి

**వలిగొండ, మహా న్యూస్ :** మండలంలోని పల్లెర్ల స్టేజీ వద్ద వలిగొండ తొర్రూరు హైవేపై జరిగిన బైక్ ప్రమాదంలో ధరావత్ చందర్ 42 అనే కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చందర్ తన సోదరుడు చందుతో కలిసి స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిల్‌పై కూలీ పనుల నిమిత్తం జంగారెడ్డిపల్లికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ నడుపుతున్న చందు అతివేగంగా అజాగ్రత్తగా వెళ్లి రోడ్డుపై ఉన్న బర్రెను ఢీకొట్టడంతో వెనుక కూర్చున్న చందర్ కిందపడిపోయాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మొండ్రాయి గ్రామానికి చెందినవాడని పోలీసులు గుర్తించారు. బైక్ నడుపుతున్న చందుకు కూడా గాయాలు కావడంతో వలిగొండలోని రేణుకాదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య ధరావత్ యాకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.



## విజయవంతమైన ఉచిత వైద్యశిభిరం.

**దమ్మపేట ,మహా** : ఏజెన్సీ మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు ఆరోగ్య సమస్యలపై ఆవగాహన కల్పించి , అతి తక్కువ ఖర్చులతో ఎంతో విలువైన వైధ్యాన్ని అందించాలనే ఉద్దేశ్యం తో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిభిరం మంగళవారం విజయవంతం అయ్యింది. ఎస్.జె.లల్లీ ఫిజియోథెరఫి క్లినిక్ వైద్యులు జి.వి ప్రియకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత శిభిరానికి చుట్టుప్రక్కల నుండి అధిక సంఖ్యలో రోగులు తరలివచ్చారు. ముఖ్యంగా దీర్ఘకాలం గా మోకాలి నొప్పులతో ,నరాల సమస్యలతో ,వెన్నుపూస బాధలతో ,కీళ్ళ సమస్యలతో బాధపడే రోగులకు ఫిజియోథెరఫి ద్వారా అతి సునాయాసంగా ఉపశమనాన్ని పొందవచ్చునంటూ అవగాహన కల్పించారు. పలువురు రోగులకు ఉచితంగా ఫిజియోథెరఫి చేసి తాత్కాలికంగా రిలీఫ్ ను అందించారు. కొంత సమయం ఇలా ఫిజియోథెరఫి చేయిస్తే సమస్య పూర్తిగా తగ్గే అవకాశం ఉంటుందని రోగులకు వివరించారు. అదే విదంగా దంత సమస్యలకు అవసరమైన అవగాహన ను డెంటల్ వైద్యులు బి.రాంబాబు పరిక్షలు చేసి రోగులకు అందించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాకాంత్ మాట్లాడుతూ ఈ ఫిజియోథెరఫి క్లినిక్ ను ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా ఉన్న బాబు హాస్పటల్ నందు అన్ని సమయాలలో అందుబాటులో ఉంచుతున్నామని , బాధితులు సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# వజ్రాల వేటలో 'జో జో' సందడి!

హైదరాబాద్: రాయలసీమ గ్రామీణ నేపథ్యంలో ప్రేమ, ఆశలు, హాస్యాన్ని మేళవిస్తూ రూపొందుతున్న కొత్త చిత్రం 'జో జో' టాలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతోంది. ప్రముఖ దర్శకుడు దేవా కట్టా సమర్పణలో కిరణ్ జయ్ కుమార్ రచన, దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. తాజాగా విడుదలైన 'కాషన్ 1' గ్లింప్స్ చిత్రంలోని కథాంశం, పాత్రల స్వభావంపై ఆసక్తికరమైన సంకేతాలిచ్చింది. రాయలసీమలోని జొన్నగిరి ప్రాంతాన్ని కథకు నేపథ్యంగా ఎంచుకోవడం ఈ సినిమాకు ప్రత్యేకతగా నిలుస్తోంది. వర్షాలు కురిసిన తర్వాత పొలాల్లో వజ్రాలు దొరుకుతాయనే నమ్మకం చుట్టూ కథను అల్లినట్లు గ్లింప్స్ ద్వారా తెలుస్తోంది. అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే ఆశతో వజ్రాల కోసం వెతికే యువత, వారి మధ్య చోటుచేసుకునే సంఘటనలు కథలో వినోదాన్ని పంచనున్నాయి. సాధారణ రాళ్లను సైతం వజ్రాలుగా భావిస్తూ ఆశపడే వ్యక్తుల మనస్తత్వాన్ని హాస్యభరితంగా చూపించే ప్రయత్నం కనిపిస్తోంది. ప్రేమను వ్యక్తం చేయడానికి ప్రయత్నించే యువకుడు, అతడికి అనూహ్యంగా సమాధానమిచ్చే యువతి మధ్య సన్నివేశాలు సహజమైన గ్రామీణ హాస్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా స్థానిక యాస, బోల్డ్ సంభాషణలు ఈ గ్లింప్స్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ కథనానికి భిన్నంగా ముతక హాస్యం, గ్రామీణ వాతావరణం, ప్రేమకథను కలిపి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం ప్రయత్నిస్తోంది. విజయ్ కృష్ణ లింగమనేని విజయం బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కృష్ణ కమల్ కథానాయకుడిగా, మాహి శ్రీ కథానాయికగా నటిస్తున్నారు. మకరంద్ దేశ్‌పాండే, ఫణీంద్ర దేవరపల్లి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రోహిత్ కుమార్ ఛాయాగ్రహణం అందిస్తుండగా, మహేష్ శంకర్ సంగీత బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో కూడిన విభిన్న కథలను ఇష్టపడే ప్రేక్షకులకు 'జో జో' కొత్త అనుభూతిని అందిస్తుందనే అంచనాలు ఉన్నాయి. తొలి గ్లింప్స్‌తోనే చర్చకు తెరతీసిన ఈ చిత్రం తదుపరి ప్రచార చిత్రాలతో ఎలాంటి ఆసక్తిని రేకెత్తిస్తుందో చూడాలి. సినిమా విడుదల తేదీపై చిత్రబృందం నుంచి మరిన్ని వివరాలు రావాల్సి ఉంది.



# ఆరెంజ్ లెహంగాలో రిద్ధి

హైదరాబాద్: సినీ నటి రిద్ధి కుమార్ సంప్రదాయ దుస్తుల్లో అందంగా కనిపిస్తూ ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆరెంజ్ రంగు లెహంగాలో ఆమె చేసిన ఫొటోషూట్ సంప్రదాయ వస్త్రధారణకు ఆధునిక అందాన్ని జోడించినట్లుగా నిలుస్తోంది. ప్రకాశవంతమైన నారింజ రంగు దుస్తులు, వాటిపై ఆకర్షణీయమైన డిజైన్లు ఆమె రూపానికి ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చాయి. సంప్రదాయ భారతీయ వస్త్రధారణను ఇష్టపడే వారికి ఈ లుక్ మంచి ఫ్యాషన్ ప్రేరణగా నిలుస్తోంది. లెహంగాకు సరిపోయేలా ఎంపిక చేసుకున్న దుపట్టా, ఆభరణాలు, మేకప్ ఆమె అందాన్ని మరింత ఇనుమడింపజేస్తున్నాయి. అతిగా అలంకరణలకు ప్రాధాన్యం ఇవ్వకుండా దుస్తుల రంగు, డిజైన్ ప్రత్యేకంగా కనిపించేలా చేసిన స్టైలింగ్ ఈ ఫొటోషూట్‌లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. పండుగలు, పెళ్లిళ్లు, ప్రత్యేక వేడుకల్లో సంప్రదాయ దుస్తులతో అందంగా కనిపించాలని కోరుకునే యువతులు ఇలాంటి రంగుల కలయికలను పరిశీలించవచ్చు. ముఖ్యంగా ఆరెంజ్ వంటి ప్రకాశవంతమైన రంగులు వేడుకల వాతావరణానికి ఉత్సాహాన్ని జోడిస్తాయి. వాటికి సరిపోయే ఆభరణాలు, సున్నితమైన మేకప్, చక్కటి హెయిర్‌స్టైల్ ఎంచుకుంటే ఆకర్షణీయమైన రూపాన్ని పొందవచ్చు. రిద్ధి కుమార్ తన వస్త్రధారణ ఎంపికలతో సంప్రదాయ శైలికి ఆధునికతను జోడిస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తెలుగు చిత్రాలతో పాటు ఇతర భాషల సినిమాల్లోనూ నటించిన ఆమె, తెరపై తన నటనతోనే కాకుండా ప్రత్యేక సందర్భాల్లో తన ఫ్యాషన్ ఎంపికలతోనూ వార్తల్లో నిలుస్తున్నారు. ఈ ఆరెంజ్ లెహంగా లుక్ సంప్రదాయ అందం, సమకాలీన ఫ్యాషన్ కలిసిన శైలికి ఉదాహరణగా చెప్పవచ్చు.



# 'రాజాసాబ్' ఫలితంపై నిర్మాత కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా, మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన 'ది రాజాసాబ్' సినిమా ఫలితంపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తాజాగా స్పందించారు. సంక్రాంతి సమయంలో సినిమాను విడుదల చేయడం ఆశించిన ఫలితాన్ని ప్రభావితం చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు. మరో సమయంలో విడుదల చేసి ఉంటే సినిమా ఫలితం భిన్నంగా ఉండేదని పేర్కొన్నారు. తాజాగా 'గరివిడి లక్ష్మి' సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, 'రాజాసాబ్'కు సంబంధించిన అనుభవాలను మీడియాతో పంచుకున్నారు. సినిమా స్థాయి, నిర్మాణ పరిమాణానికి తగినట్లుగా మంచి విడుదలే లభించినప్పటికీ, విడుదల సమయం విషయంలో సరైన నిర్ణయం తీసుకోలేకపోయామని తెలిపారు. ముఖ్యంగా టికెట్ ధరల పెంపు కోసం ప్రయత్నించడం వల్ల ప్రీమియర్ షోల నిర్వహణలో ఆలస్యం జరిగిందని, దీంతో అభిమానులు, ప్రేక్షకులు అసహనానికి గురయ్యారని వివరించారు. ఈ విషయంలో అలా చేయకుండా ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. సినిమా ఫలితంపై విడుదల సమయంతో పాటు మరికొన్ని అంశాలు కూడా ప్రభావం చూపాయని పేర్కొన్నారు. ప్రభాస్ నటించిన ఈ చిత్రంపై విడుదలకు ముందు భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన రావడంతో సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ నటించగా, మారుతి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇదిలా ఉండగా, 2028లో ప్రభాస్‌తో మరో భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించనున్నట్లు విశ్వప్రసాద్ వెల్లడించారు. ప్రస్తుతం ఆయన నిర్మాణంలో రూపొందిన 'గరివిడి లక్ష్మి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. 'రాజాసాబ్' అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్తులో సినిమాల విడుదల, ప్రచార వ్యూహాల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే సంకేతాలను నిర్మాత వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి.





# ఏఐ దుర్వినియోగంపై శ్రియ ఆగ్రహం

హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి మహిళల ఫొటోలు, వీడియోలను అసభ్యకరంగా మార్చడంపై సినీ నటి శ్రియ శరణ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల బాలీవుడ్ నటి జాన్వీ కపూర్‌కు సంబంధించిన వీడియోను ఏఐ సాయంతో మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన ఘటన నేపథ్యంలో శ్రియ స్పందించారు. సాంకేతికతను సృజనాత్మక ప్రయోజనాలకు ఉపయోగించుకోవాల్సింది పోయి, వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. తన ఫొటోలను సైతం గతంలో కొందరు మార్ఫింగ్ చేసి, అసలు రూపాన్ని మార్చి ప్రచారం చేసిన సందర్భాలు ఉన్నాయని శ్రియ వెల్లడించారు. ఏఐ ద్వారా వ్యక్తుల శరీరాకృతిని మార్చడం, దుస్తులను తొలగించినట్లుగా చూపించడం వంటి చర్యలు ఇబ్బందికరంగా ఉంటాయని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, దానిని తప్పుగా ఉపయోగిస్తే తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. ప్రతి కొత్త సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించడం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇటీవల జాన్వీ కపూర్, ఎన్టీఆర్ నటించిన 'దేవర' చిత్రంలోని 'చుట్టమల్లే' పాటకు సంబంధించిన దృశ్యాలను ఏఐతో మార్చి అభ్యంతరకరంగా చూపించిన వీడియో వివాదానికి దారితీసింది. దీనిపై జాన్వీ తీవ్రంగా స్పందిస్తూ, తన అనుమతి లేకుండా రూపొందించిన ఇలాంటి కంటెంట్ మహిళల గౌరవానికి భంగం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎన్టీఆర్ సహా పలువురు సినీ ప్రముఖులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తుల అనుమతి లేకుండా వారి చిత్రాలను మార్చి అసభ్యకరంగా ప్రచారం చేయడం వ్యక్తిగత గోప్యత, గౌరవానికి సంబంధించిన తీవ్రమైన సమస్యగా మారుతోంది. ఏఐ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో దాని వినియోగంపై అవగాహన పెంచడంతో పాటు, దుర్వినియోగానికి పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. సాంకేతికత అభివృద్ధి మానవాళికి ఉపయోగపడాలే తప్ప, ఇతరులను అవమానించడానికి లేదా వేధించడానికి సాధనంగా మారకూడదనే సందేశాన్ని ఈ ఘటనలు ఇస్తున్నాయి.

# వైరల్ పాటతో 'పర్ణశాల'కు క్రేజ్!

హైదరాబాద్: సినిమా విడుదలకు ముందే ఓ పాట సోషల్ మీడియాలో విపరీతమైన ఆదరణ పొందితే ఆ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరగడం సహజం. ఇప్పుడు 'పర్ణశాల' సినిమా విషయంలోనూ ఇదే జరుగుతోంది. ఈ చిత్రంలోని 'జిమ్ జిమ్ తార' పాట నెట్టింట ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇప్పటికే ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌లో ఈ పాటకు సంబంధించిన వీడియోలు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. సామాన్యుల నుంచి సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ల వరకు పలువురు ఈ పాటకు అనుగుణంగా వీడియోలు రూపొందిస్తున్నారు. దీంతో పాటపై చర్చ మరింత పెరిగింది. తాజాగా ఈ గీతం పూర్తి వెర్షన్‌ను ఆదిత్య మ్యూజిక్ ద్వారా చిత్రబృందం విడుదల చేసింది. జి. లక్ష్మీదేవి స్వయంగా ఈ పాటకు సాహిత్యం అందించడంతో పాటు ఆలపించడం విశేషం. చిన్న పాట ముక్కతో మొదలైన ప్రచారం పూర్తిస్థాయి గీతం విడుదల వరకు చేరడం చిత్రబృందానికి ఉత్సాహాన్నిస్తోంది. ఎస్ఎల్‌టీ ఫిలిమ్స్ పతాకంపై మంచి వెంకట్ నిర్మిస్తున్న ఈ సినిమాకు వై.జి. భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్, కామెడీ, సస్పెన్స్ అంశాలను కలగలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సాధారణ ప్రచార పద్ధతులకు భిన్నంగా పాట ద్వారా సినిమాపై ఆసక్తిని పెంచే ప్రయత్నం కనిపిస్తోంది. ఒక పాట ప్రజల్లోకి బలంగా వెళ్లడం చిన్న చిత్రాలకు ప్రచారపరంగా ఉపయోగపడుతుందనే అభిప్రాయానికి ఈ పరిణామం ఉదాహరణగా నిలుస్తోంది. అయితే పాటకు వస్తున్న ఆదరణ సినిమా విజయంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది విడుదల తర్వాతే స్పష్టమవుతుంది. 'జిమ్ జిమ్ తార'తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన 'పర్ణశాల' సినిమా తదుపరి ప్రచార కార్యక్రమాలతో మరింత ఆసక్తి రేకెత్తిస్తుందేమో చూడాలి.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com